ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 237
మంగళవారం 08 సెప్టెంబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



## 2013లో ఎలా ఉన్నామో ఇప్పుడెలా ఉన్నామో చూడండి

**స్తబ్దత నుంచి శరవేగంగా దూసుకుపోతున్నాం**

**శ్రీరాం కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని వ్యాఖ్యలు**

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 07)

విధానపరమైన స్తబ్దత నుంచి కోలుకుని ఈ పుష్కర కాలంలో చైతన్యంతో భారత్ ఎంతో పురోగమించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశాన్ని బలహీనతలోకి నెట్టినవారు ప్రస్తుతం సాధిస్తున్న 7.8శాతం వృద్ధిరేటును జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించినవారు ఇప్పుడు చిత్తుగా ఓడిపోయారని, పాకిస్థాన్ ఎటువంటి దుస్సాహసానికి పాల్పడినా... భారత సైన్యం వారి గడ్డపైకే వెళ్లి బుద్ధి చెప్పగలుగుతోందన్నారు. అంతర్గతంగా నక్సలిజం వెన్నువిరిచామని పేర్కొన్నారు. 2013లో దేశం ఎలాంటి పరిస్థితుల్లో ఉండేదో... ఇప్పుడెలా ఉందో చూడాలని యువతకు మోదీ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి ఢిల్లీ విశ్వవిద్యాలయ అనుబంధ ▶మిగతా 2లో

## జగన్, విజయసాయిరెడ్డి ఇద్దరూ క్రైమ్ పార్ట్‌నర్స్

**మంత్రి సత్యకుమార్**

విజయసాయిరెడ్డి కొత్త పార్టీ యత్నాలపై సత్యకుమార్ విమర్శలు

ప్రజాధనాన్ని దోచుకున్న వ్యక్తి

ఏ ముఖం పెట్టుకుని పార్టీ పెడుతున్నారని ప్రశ్న

జగన్ కేసుల్లో విజయసాయి ఏ-2గా ఉన్నారని వ్యాఖ్య



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 07)

రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు యత్నాలపై ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శులు గుప్పించారు. ప్రజాస్వామ్యంలో ▶ 2లో

# వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం..

## ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి: సీఎం చంద్రబాబు



**రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి పడతామన్న సీఎం**

**'వాటర్ మ్యాన్'గా ఎకనామిక్ టైమ్స్ కథనంపై హర్షం**

**సీఎంకు నేతల స్టాండింగ్ ఒవేషన్**

**వైసీపీ ఫేక్ ప్రచారాన్ని ఫ్యాక్ట్‌తో తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు**

**కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు సముచిత గౌరవమని హామీ**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,

రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్టాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందని అన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'లీడర్‌షిప్ కాన్‌క్లేవ్'లో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సాగునీటి

2

## టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ ప్రారంభం..

**10 కీలక అంశాలపై మేధోమథనం**

(షణ్ముఖ వెలుగు, అమరావతి, సెప్టెంబర్ 07)

టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల లీడర్‌షిప్ కాంక్లేవ్ సోమవారం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, మంత్రులు, పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాజకీయాల్లో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సమావేశం ప్రారంభానికి ముందు వేదికపై ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు, ఇతర నేతలు నివాళులర్పించారు.

ఈ కాంక్లేవ్‌లో భాగంగా మొత్తం 10 కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం-పార్టీ మధ్య సమన్వయం, అందుబాటులో ఉన్న వనరుల సమర్థ వినియోగం, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావడం, ఎల్ నినో ప్రభావం వంటి అంశాలపై నేతలు ▶మిగతా 2లో

## స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రస్థానం దేశానికే ఆదర్శం

**యోగి ఆదిత్యనాథ్**

(షణ్ముఖ వెలుగు, అమరావతి, సెప్టెంబర్ 07)



గ్రామీణాభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రస్థానం దేశానికే ఆదర్శనీయమని ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ?శీస్త్రఱ చూనఉఋఖఅఫ్ట్ర) అన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో నిర్వహించిన 'స్వర్ణ భారత్-సేవా హారతి' రజతోత్సవ వేడుకల్లో

2



## శిథిలాల కింద విద్యార్థుల ప్రాణాలు.. అసలు తప్పెవరిది?

(షణ్ముఖ వెలుగు, అమరావతి,

దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి భద్రత తీవ్ర ప్రశ్నార్థకమైంది. రద్దీగా ఉండే సత్య నికేతన్ ప్రాంతంలో సంభవించిన దారుణ ప్రమాదం అనేక కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. ఐదు దశాబ్దాల నాటి ఒక బహుళ అంతస్తుల భవనం కంటిరెప్పపాటులో నేలమట్టమైంది. చదువుకొని సమున్నత శిఖరాలను అధిరోహించాలనే ▶మిగతా 2లో

## బీసీ జెండాతో జూనియర్ అయ్యన్న రెడీ !



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 07)

చంద్రబాబుకు అయ్యన్నపాత్రుడి మాదిరిగా లోకేష్ కి విజయ్ ఉంటారు అని నర్సీపట్నం టీడీపీ తమ్ముళ్లు అంటూంటారు. అది నిజం అన్నట్లుగా లోకేష్ కి ఎంతో విశ్వాసపాత్రుడిగా విజయ్ చాలా ఏళ్ళుగా మెలుగుతూ వస్తున్నారు. ఐటీడీపీలో ఆయనే కీలకంగా ఉంటున్నారు. లోకేష్ టీం లో ఆయనే ముందు వరసలో ఉంటారు. ఇక చూస్తే లేటెస్ట్ గా రాజ్యసభ పదవి కూడా విజయ్ కి దక్కింది అంటే దానికి చంద్రబాబు లోకేష్ ఆయన మీద పెట్టిన బాధ్యత అని కూడా చెబుతారు. దానికి తగినట్లుగానే పార్లమెంట్ లో తొలి రోజు నుంచే విజయ్ టీడీపీ తరపున గట్టిగానే వాయిస్ వినిపిస్తున్నారు. ఇక గ్రౌండ్ లెవెల్ లో కూడా ఆయన దిగి భవిష్యత్తు టీడీపీ కోసం యాక్షన్ ప్లాన్ ని రూపొందించారు. ▶మిగతా 2లో

## కష్టపడి మెగా డీఎస్సీ సాధించిన నిరుద్యోగులపై బురదజల్లుతారా?

**స్వార్థ రాజకీయాల కోసం వారిని అవమానించవద్దని హితవు**

**ఉద్యోగాలు సాధించిన వారి కష్టాలను ప్రశ్నించవద్దని సూచన**



(షణ్ముఖ వెలుగు, అమరావతి, సెప్టెంబర్ 07)

మెగా డీఎస్సీలో ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను, వారి విజయాన్ని అవమానించేలా వైసీపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేయడం అత్యంత బాధాకరమని ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మెగా డీఎస్సీ సాధించిన అభ్యర్థులను వేధించడం, వారిపై బురదజల్లడాన్ని వైసీపీ నేతలు వెంటనే మానుకోవాలని హితవు పలికారు. 2018 డీఎస్సీలో తృటిలో ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా.. ఏడేళ్ల పాటు పట్టుదలతో, రాత్రింబవళ్లు తేడా లేకుండా చదివి ఎన్నో త్యాగాలు చేసి 2025 మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని మంత్రి కొనియాడారు. ▶మిగతా 2లో

# పల్లెల్లో ప్రగతి... జనసేనకు పల్లె వెలుగులు..!

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 07)

దేశ ప్రగతికి పల్లెలే పట్టుకొమ్మలు.. అన్న మహాత్మాగాంధీ స్ఫూర్తిని నిలువెల్లా పుణికి పుచ్చుకున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్.. పల్లెల బాగుచేతకు నడుం బిగించారు. పల్లెలు బాగుంటేనే ప్రజలు బాగుంటారని.. తద్వారా దేశం కూడా బాగుంటుందని భావిస్తున్న ఆయన.. చెప్పేదానికంటే కూడా చేసేదే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం పల్లె ల్లో ఒక మహోద్యమం కొనసాగుతోంది. అదే.. పల్లెల బాగు!. రాష్ట్ర వ్యాప్తంగా పల్లెలు నేడు కళకళలాడుతున్నాయి!. నిజానికి ఒకప్పుడు పల్లెల నుంచి పట్టణాలకు వలస వచ్చేవారు.కానీ.. నేడు పల్లెల నుంచి పట్టణాలకు వలస వెళ్తున్నకుటుంబాలు కనిపిస్తున్నాయి. మీ గ్రామంలో అమ్మే భూమి ఉంటే చెప్పు.. అని ఉద్యోగులు చర్చించుకునే పరిస్థితి వచ్చింది. దీనికి కారణం.. గత రెండు సంవత్సరాలుగా పల్లెలపై ప్రభుత్వం.. ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి ఫోకస్ పెంచడమే. దీంతో రిటైర్మెంట్ కోసం వేచి చూస్తున్న ఉద్యోగులు తమ తమ పల్లెలకు వలస బాటపడుతున్నారు. అంతేకాదు.. స్థానికంగా చేసుకునేందుకు ఉపాధి ▶మిగతా 2లో



# 2013లో ఎలా ఉన్నామో ఇప్పుడెలా ఉన్నామో చూడండి

శ్రీరాం కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా తాను ఇక్కడికి వచ్చి చేసిన ప్రసంగాన్ని ఆయన గుర్తుచేశారు. "2013లో నేను ఎస్ఆర్‌సీసీకి వచ్చినప్పుడు ఓ విజన్‌ను ఆవిష్కరించా. అప్పట్లో మీకు సగం నీటితో ఉన్న గ్లాస్ ఉదాహరణ చెప్పా. కొంత మంది ఆ గ్లాస్ సగం నిండిందని అంటారు. మరి కొందరు సగం ఖాళీగా ఉందంటారని తెలిపా. కానీ నేను మాత్రం సగం నీరు, సగం గాలితో అది పూర్తిగా నిండి ఉందని అంటానని వివరించా. 2013లో అభివృద్ధి అత్యల్ప స్థాయిలో ఉన్నప్పుడు.. ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటినప్పుడు.. కుంభకోణాలు పతాక స్థాయిలో జరుగుతున్నప్పుడు.. భయం లేకుండా అవినీతి రాజ్యమేలుతున్నప్పుడు.. ఉగ్రవాదులు కట్టడిలేకుండా చెలరేగుతున్నప్పుడు.. పాకిస్థాన్ అదుపు తప్పినప్పుడే.. నేను పూర్తిగా నిండిన గ్లాస్‌ను చూశా! 12 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఉగ్రవాదం పీచమణిచాం. పాకిస్థాన్ ఏ దుశ్చర్యకు పాల్పడకుండా కట్టడి చేశాం. నక్సలిజాన్ని అంతం చేశాం. విధానపరమైన స్తబ్ధత నుంచి చైతన్యం దిశగా సాగాం. ఒకప్పుడు బలహీన దేశంగా పేర్కొన్నవారే ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా కొనియాడుతున్నారు. అప్పట్లో నా ఆశావాదాన్ని కొందరు ప్రశ్నించారు. మేక్ ఇన్ ఇండియాపై అనుమానాలు వ్యక్తం చేశారు. అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితుల్లోనూ ఇప్పుడు భారత్ 7.8% వృద్ధి రేటును సాధించింది. అప్పట్లో భారత్‌ను వెనక్కిలాగినవారు ఇప్పుడు దానిని జీర్ణించుకోలేకపోతున్నారు" అని ప్రధాని పేర్కొన్నారు.

**అప్పట్లో ఇదీ పరిస్థితి...**

2013లో దేశ పరిస్థితి ఎలా ఉందో యువత చూడాలని, అప్పట్లో పతాక శీర్షికలను తెలుసుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "అప్పట్లో ఎల్వోసీ వెంట భారతీయ సైనికులు మరణించారన్న వార్తలు పతాక శీర్షికలుగా పత్రికల్లో వచ్చేవి. భారత్ వృద్ధి రేటును ప్రపంచ బ్యాంకు తగ్గించేది. ద్రవ్యలోటు ఆల్‌టైం గరిష్ఠంగా ఉండేది. ద్రవ్యోల్బణం 10శాతంగా ఉండేది. అప్పటి పరిస్థితి ఇప్పటి యువతకు తెలియదని నాకు తెలుసు.

**పూర్వ విద్యార్థులు 'ఓజీ'లు**

ఒక వ్యక్తి వందేళ్లు జీవిస్తే అపార జ్ఞానాన్ని సంపాదించారని, గొప్ప అనుభవం కలిగి ఉన్నారని భావిస్తాం. అదే ఒక సంస్థ వందేళ్లు కొనసాగితే అది విజయాల మహా సముద్రంగా మారుతుంది. తరతరాలను తీర్చిదిద్దిన ఎస్ఆర్‌సీసీ అలాంటిదే. ఇక్కడికి వచ్చినవారు విద్యను అభ్యసిస్తారు. బయటకు వెళ్లినవారు శిల్పాలుగా వెళ్తారు. ఎస్ఆర్‌సీసీ పూర్వ విద్యార్థులు ఎంతో ప్రత్యేకం. మీ భాషలో చెప్పాలంటే 'ఓజీలు" అని ప్రధాని కొనియాడారు. వారిని ధురంధర్‌లతోనూ పోల్చారు. ఎస్ఆర్‌సీసీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన 100 రూపాయల నాణేన్ని ప్రధాని ఆవిష్కరించారు.

# జగన్, విజయసాయిరెడ్డి ఇద్దరూ క్రైమ్ పార్ట్‌నర్స్

రాజకీయ పార్టీ పెట్టుకునే హక్కు అందరికీ ఉందని, అయితే దశాబ్దాల పాటు ప్రజాధనాన్ని యథేచ్ఛగా దోచుకున్న వ్యక్తి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని పార్టీ పెడుతున్నాడో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుపతి పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి, అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ అధినేత జగన్ అక్రమ ఆస్తుల కేసుల్లో విజయసాయిరెడ్డి ఏ-2గా ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

"జగన్, విజయసాయిరెడ్డి ఇద్దరూ నేరాలు చేయడంలో పార్ట్‌నర్స్" అని మంత్రి సత్యకుమార్ ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల హయాంలో విచ్చలవిడిగా సాగిన నాసిరకం, అక్రమ మద్యం సరఫరా వల్ల రాష్ట్రంలో ఏకంగా 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది తీవ్ర అనారోగ్య పాలయ్యారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేయడంతో పాటు వేలాది కుటుంబాల నాశనానికి కారణమైన జగన్, విజయసాయిరెడ్డి ఇద్దరూ ప్రజల కోర్టులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని అన్నారు.

# టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ ప్రారంభం..

సమాలోచనలు జరుపుతున్నారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాప్రతినిధుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోనున్నారు. పథకాల అమలులో ఎదురవుతున్న సవాళ్లు, వాటిని అధిగమించే మార్గాలపై ఈ రెండు రోజుల సమావేశంలో విస్తృతంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. పార్టీని, ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కాంక్లేవ్ ప్రధాన ఉద్దేశం.

# బీసీ జెండాతో జూనియర్ అయ్యన్న రెడీ !

**జయహో బీసీ అంటూ :** ఎంపీ విజయ్ ఇపుడు తన సొంత ఇలాకా నర్సీపట్నంలో జయహో బీసీ అంటూ భారీ ఎత్తున రాష్ట్ర స్థాయి సభను నిర్వహించే సన్నాహాలలో ఉన్నారు. ఈ సభకు ఏపీ నలుమూలల నుంచి బీసీలు పెద్ద ఎత్తున వస్తారని అలాగే తెలుగుదేశం పార్టీకి చెందిన బీసీ నేతలు అంతా హాజరవుతారని అంటున్నారు. నిజానికి చూస్తే ఉత్తరాంధ్రా జిల్లాలు బీసీలు నూటికి ఎనభై శాతం ఉన్న ప్రాంతాలుగా పేర్కొంటారు. దాంతో ఉత్తరాంధ్రా గడ్డ మీదనే బీసీ సభను నిర్వహించి జయప్రదం చేయాలని విజయ్ తలపెట్టారు. ఈ నెల 9న ఆయన నర్సీపట్నం వేదికగా భారీ సభను నిర్వహించి టీడీపీకి ప్రతిష్టను తెస్తూ ఏపీ రాజకీయాల్లోనే సంచలనం రేకెత్తించాలని చూస్తున్నారు అని అంటున్నారు.

**బ్రాండ్ ని పెంచుతూ :** బీసీల పార్టీగా టీడీపీకి ఎంతో గుర్తింపు ఉంది. ఆ బ్రాండ్ ఇమేజ్ ని మరింత పెంచేలా ఈ సభను నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. బీసీలకు స్థానిక సంస్థల

## మొదటి పేజీ తరువాయి

ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని ఎంపీ విజయ్ చెబుతున్నారు. బీసీల రక్షణ కోసం చట్టం తీసుకుని వస్తామని యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ హామీ ఇచ్చారని దానిని కూటమి నిలబెట్టుకుందని అయన గుర్తు చేస్తున్నారు. దీంతో చంద్రబాబు నారా లోకేష్ లకు కృతజ్ఞతలు తెలియ చేయవలసిన బాధ్యత ఉందని అందుకే జయహో బీసీ సభ అని ఆయన అంటున్నారు.

**ఐక్యతను చాటేందుకే :** ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా బీసీలంతా తరలివచ్చి ఐక్యతను చాటాలని కోరుతున్నారు. ఈ సభ గతంలో ఎన్నడూ జరగని విధంగా ఘనంగా నిర్వహించాలని కూడా ఎంపీ విజయ్ భావిస్తున్నారు. జయహో బీసీ సభ ద్వారా జూనియర్ అయ్యన్న తన రాజకీయ వ్యూహానికి పదును పెట్టారని అంటున్నారు. తనకు ఎంపీ పదవి ఇచ్చి పార్టీలో కీలక స్థానం కల్పించిన తెలుగుదేశం పార్టీకి జీవగర్ర గా ఉన్న బీసీలందరినీ ఒకే చోటుకు చేర్చడం ద్వారా పార్టీకి మరింత పరిపుష్టి తీసుకుని రావాలని ఆయన చూస్తున్నారు. అంతే కాదు బీసీలలో సరికొత్త యువ నాయకుడిగా కూడా ఈ సభ ద్వారా ఆయన అవిష్కరించబడతారని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేడి రాజుకున్న నేపథ్యంలో జయహో బీసీ సభ ఏ విధమైన స్పందనను కలిగిస్తుందో చూడాల్సి ఉంది.

# కష్టపడి మెగా డీఎస్సీ సాధించిన నిరుద్యోగులపై బురదజల్లుతారా?

వారి విజయాన్ని స్వార్థ రాజకీయాల కోసం అవమానించడం తగదని మండిపడ్డారు.

అప్లికేషన్ల స్వీకరణ నుంచి మెరిట్ జాబితా విడుదల వరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేసిందని స్పష్టం చేశారు. మెరిట్, అర్హత ప్రాతిపదికన ఉద్యోగాలు సాధించిన వారి కష్టాన్ని ప్రశ్నించడం ఆయా అభ్యర్థుల కుటుంబాల త్యాగాలను అవమానించడమేనని ధ్వజమెత్తారు. యువత భవిష్యత్తుతో రాజకీయ క్రీడలొద్దని, అభ్యర్థుల ఆవేదనను గ్రహించి జగన్ తక్షణమే తన వైఖరిని మార్చుకోవాలని అన్నారు.

# పల్లెల్లో ప్రగతి... జనసేనకు పల్లె వెలుగులు..!

మార్గాలుగా కూడా పల్లెలు ఉపకరిస్తున్నాయి.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో పలు చానెళ్లు పల్లెల తీరుతెన్నులను అధ్యయనం చేయగా.. ఈ విషయాలు వెలుగు చూశాయి. ఒకప్పుడు చెరువు అంటే.. కనిపించే పరిస్థితి లేదు. పోనీ.. ఉన్నా.. చుట్టూ కంప, ముళ్లు, చెత్తతో నిండి పోయిన పరిస్థితి ఉండేది . కానీ, నేడు.. పల్లెల్లో చెరువులు.. -ఆహా ఏం అద్భుతం- అనిపించే ఫైవ్ స్టార్ హోటళ్లలోని కొలనుల(స్విమ్మిగ్ పూల్) మాదిరిగా సర్వాంగ సుందరంగా దర్శనమిస్తున్నాయి. దీనికిగాను .. అటు ఉపాధి హామీ(ప్రస్తుతం రాంజీ)నిధులతోపాటు.. 15వ ఆర్థిక సంఘం ఇచ్చిన నిధులను నేరుగా కేటాయిస్తున్నారు.

**స్థానికంపై ప్రభావం..** త్వరలోనే స్థానికంగా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పల్లెల బాగుచేత వ్యవహారం.. జనసేనకు కలిసి వచ్చే అవ కాశం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. రహదారుల నుంచి ఇంటింటికీ కుళాయి వరకు.. చెరువుల నుంచి .. పశువుల కు ప్రత్యేక వైద్య శాలల దాకా.. అనేక విషయాల్లో పల్లెలు నేడు.. ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. పవన్ కల్యాణ్ పనితీరు.. ఆయన దూరదృష్టికి నిదర్శనంగా మారుతున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే..జనసేనకు పల్లెవెలుగులు.. స్థానికంగా కనిపించడం ఖాయమన్నది టాక్. ఇది కూటమికి మేలు చేస్తుందని అంటున్నారు.

# వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం..

రంగంపై చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీతో యువతకు ఉపాధి కల్పించిన చంద్రబాబు, ఇప్పుడు జల సంరక్షణతో 'వాటర్ మ్యాన్'గా మారారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీఎం బాటలు వేస్తున్నారని ఎకనామిక్ టైమ్స్ కథనాన్ని ఆయన ఉటంకించారు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యాన్ని కూడా ఆ పత్రిక ప్రశంసించిందని తెలిపారు. ఈ ప్రశంసల నేపథ్యంలో పార్టీ నేతలంతా ఏకతాటిపై నిలబడి చంద్రబాబుకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి అభినందనలు తెలిపారు.

**కార్యకర్తలే పార్టీకి బలం.. కూటమి ఐక్యత ముఖ్యం**

పొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు సాగుతున్నామని చంద్రబాబు తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు పూర్తి గౌరవం ఇస్తామని, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవికి పదవి ఇవ్వడమే దీనికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేసే వారికే పార్టీలో, చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. "పార్టీ బలోపేతం ఎంత ముఖ్యమో, కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యం. ఫ్లెక్సీలు, ఫోటోల కోసం వివాదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా పనిచేయాలి. 2024 కంటే 2029లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలి," అని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

**గత పాలనపై విమర్శలు.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి**

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టి, వ్యవస్థలను విధ్వంసం చేసిందని చంద్రబాబు విమర్శించారు. పాలకుడు ఎలా ఉండకూడదో చెప్పడానికి గత పాలనే ఒక కేస్ స్టడీ అని వ్యాఖ్యానించారు. "వైసీపీ ఒక గొడ్డలి పార్టీ. ఉగ్రవాదుల తరహాలో హిట్-రన్-హైడ్ అనే విధానంతో రాజకీయాలు చేస్తోంది. వారి ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. ప్రతి ఆరోపణను వాస్తవాలతో (ఫ్యాక్ట్) గట్టిగా తిప్పికొట్టాలి. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి," అని నేతలకు దిశానిర్దేశం చేశారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ విషయంలో వైసీపీ వక్రీకరణలకు పాల్పడుతోందని, వాటిని ఎండగట్టాలని సూచించారు.

**అభివృద్ధి, సంక్షేమంలో దూకుడు**

కేంద్ర సహకారంతో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని చంద్రబాబు వివరించారు. నెలకు రూ.73 వేల కోట్లతో 63 లక్షల మందికి పైగా పెన్షన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు వంటి పథకాలను పునరుద్ధరించామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టామని, మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, రాయలసీమలో పరిశ్రమలు, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ హబ్ ఏర్పాటుతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని వివరించారు. రాజముద్ర, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూములకు భద్రత కల్పిస్తూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

# శిథిలాల కింద విద్యార్థుల ప్రాణాలు.. అసలు తప్పెవరిది?

ఆశలతో ఉజ్వల భవిష్యత్తు కోసం రాజధానికి వచ్చిన యువకుల కలలు ఈ భవన శిథిలాల కిందే నిశ్శబ్దంగా సమసిపోయాయి. ప్రమాద సమయంలో లోపల ఉన్న దాదాపు యాభై మంది విద్యార్థుల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. స్థానికులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రాణాలను పణంగా పెట్టి సహాయక చర్యలు అందించినప్పటికీ ఆ అమాయక విద్యార్థుల ప్రాణాలను కాపాడలేకపోయారు.

ఈ దారుణానికి ప్రధాన కారణం భవన బేస్‌మెంట్‌లో ఎలాంటి ముందస్తు భద్రతా చర్యలు లేకుండా చేపట్టిన మరమ్మతు పనులేనని తెలుస్తోంది. పునాదులను తీవ్రంగా బలహీనపరిచేలా పనులు చేయడంతోనే మొత్తం నిర్మాణం ఒక్కసారిగా కుప్పకూలింది. ఘటనపై పోలీసులు భవన యజమానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా.. ఢిల్లీ ప్రభుత్వం మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించింది. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా నాలుగు అంతస్తులకు మించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను తక్షణమే సీల్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాలకు తమ సానుభూతిని తెలియజేశారు.

అయితే ఈ ఘటనను కేవలం ఒక అనుకోని ప్రమాదంగా చూస్తే పొరపాటే అవుతుంది. ఇది స్పష్టంగా అధికారుల నిర్లక్ష్యం, కన్నుమూసి ఉంచే ధోరణికి నిలువెత్తు నిదర్శనం. అర్ధ శతాబ్దం నాటి పాత భవనంలో ఎటువంటి భద్రతా ప్రమాణాలు లేకుండా పీజీ నిర్వహిస్తుంటే స్థానిక అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. అగ్నిమాపక, నిర్మాణ భద్రతా అనుమతులు లేకున్నా రాజధానిలో వందలాది పీజీలు యథేచ్ఛగా నడుస్తున్నాయి. ప్రమాదం జరిగాక పరిహారాలు ప్రకటించడం, సీలింగ్ ఆదేశాలు ఇవ్వడం కాకుండా ముందే తనిఖీలు ఎందుకు చేపట్టడం లేదనేది స్థానికుల ఆగ్రహం. చదువు కోసం వచ్చే పేద, మధ్యతరగతి విద్యార్థులు తక్కువ ఖర్చుతో లభించే వసతుల కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి ఇలాంటి ప్రమాదకర భవనాల్లో ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం, అధికారులు కేవలం సానుభూతి సందేశాలతో సరిపెట్టకుండా, నిర్మాణ నిబంధనలను కఠినంగా అమలు చేసి అక్రమ నిర్మాణాలపై శాశ్వత చర్యలు తీసుకున్నప్పుడే ఇటువంటి విషాదాలకు ముగింపు పడుతుంది.

# స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రస్థానం దేశానికే ఆదర్శం

ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. "స్వర్ణ భారత్ ట్రస్ట్ 25 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం. సమాజం కోసం తీసుకున్న సంకల్పం ఎంతో గొప్పది. ఈ ట్రస్ట్ ఏర్పాటుకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. దేశవ్యాప్తంగా ఆయన ఎంతో పేరు గడించారు. రాజ్యసభ ఛైర్మన్‌గా అందర్నీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్లారు. ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధిగా ఆయన పనిచేశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, వేషభాషలు, వంటకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

25 ఏళ్ల క్రితం స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రారంభమైంది. ప్రధాని నరేంద్రమోదీ ప్రయాణం కూడా అప్పుడే మొదలైంది. ఇద్దరి లక్ష్యం వికసిత్ భారత్ ఇప్పుడు ఆవిష్కృతమైంది. గ్రామీణ అభివృద్ధితో పాటు మహిళాభివృద్ధి, ఆర్థికాభివృద్ధికి స్వర్ణభారత్ ట్రస్ట్ పాటుపడుతోంది. ఉత్తరప్రదేశ్‌లో పేద, నిరుపేద పిల్లలకి రెసిడెన్షియల్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యని అందిస్తున్నాం. బాషలు, ప్రాంతాలు వేరైనా లక్ష్యం ఒక్కటే. పిల్లల్లో దేశభక్తి పెరగాలి. ఏ దేశానికి వెళ్లినా భారతీయులమని గర్వంగా చెప్పుకోవాలి" అని యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు.

**సామాజిక అంతరాలను తగ్గించడమే మా ప్రధాన ఉద్దేశం: వెంకయ్యనాయుడు**

గ్రామీణ భారతం పురోగమించినప్పుడే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆ లక్ష్యంతోనే స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి ద్వారా సామాజిక అంతరాలను తగ్గించడమే తమ ప్రధాన ఉద్దేశమన్నారు. పేదరిక నిర్మూలనకు కేవలం సహాయం అందించడం కాకుండా యువత తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే నిజమైన సాధికారత అని చెప్పారు. తమ పిల్లలను రాజకీయాల వైపు ప్రోత్సహించలేదని వెంకయ్యనాయుడు తెలిపారు. తన మానసపుత్రిక అయిన స్వర్ణభారత్ ట్రస్ట్ బాధ్యతలను కుమార్తె దీపా వెంకట్‌కు అందించానని.. తన కుమారుడు హర్షవర్ధన్ ముప్పవరపు ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తున్నారని వివరించారు. వారి రాజకీయ భవిష్యత్తు గురించి తాను ప్రస్తావించనని, ప్రోత్సహించనని చెప్పారు. అయితే వారి సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, స్వర్ణభారత్ ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, ముప్పవరపు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# అఖిలభారత రైతు-కూలీ సంఘం రాష్ట్ర తొమ్మిదవ మహాసభలను జయప్రదం చేయండి

### అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి చలంచర్ల వెంకటేశ్వర్లు

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 7)**

సెప్టెంబరు 11, 12 వ తేదీలలో అనంతపురంలో జరుగు అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర తొమ్మిదవ మహాసభలను జయప్రదం చేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి చలంచర్ల వెంకటేశ్వర్లు రైతులకు, కూలీలకు పిలుపునిచ్చారు. సోమవారం కరేడు పంచాయతీ బాలకోటయ్య సంఘంలో అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్రమహాసభల పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఫాసిస్టు పాలకులు దేశ రైతాంగానికి కూలీలకు హామీ ఇచ్చారని, కానీ గత 12 సంవత్సరాల్లో రైతుల భూములను బలవంతంగా భూసేకరణ చేసి కార్పొరేట్లకు కట్టబెట్టె చర్యలు చేపట్టారని, అందుకోసం




మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చారని, రైతాంగం 11 నెలలు పోరాడి ప్రతిఘటించడంతో తాత్కాలికంగా వెనక్కి తగ్గిన కేంద్ర ప్రభుత్వంరాష్ట్రాల పరిధిలో రైతుల భూములను రాష్ట్ర ప్రభుత్వాలే కబ్జా చేసి కార్పొరేట్లకు కట్టబెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లాలో కరేడు, చేవూరు ప్రాంతాల్లో ఇండోస్సోల్ కంపెనీ కోసం రైతులను నయానో, భయానో భయపెట్టి, భ్రమలకు గురిచేసి రైతుల నుండి భూసేకరణ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందు వలన రైతులు కూలీలుగా మారుతున్నారన్నారు. కూలీలు పనులు లేక పొట్ట చేతబట్టుకుని ఇతర ప్రాంతాలకు వలసలు పోవలసిన పరిస్థితి ఉందని, అందువలన " రైతు గెలవాలి వ్యవసాయం నిలవాలి" అనే నినాదంతో అనంతపురంలో జరుగుతున్న రైతు కూలి సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐయఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ మోహన్, రైతు కూలీ సంఘం మండల నాయకులు మన్నేపల్లి కృష్ణ, ఇరుగు వెంకటేశ్వర్లు, కొమరగిరి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్ పరిశీలన



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 7)**

ఒంగోలులోని కమ్మపాలెంలో గల రైతుబజార్ నందు అన్న క్యాంటీన్‌ను సోమవారం జిల్లా డిఆర్పి, అన్న క్యాంటీన్ శిక్షణ అధికారి సౌజన్య పరిశీలించారు. కాంటీన్ నందు ఆహారాన్ని రుచి చూసి ప్రజలతో మాట్లాడి ఆహార నాణ్యత, పరిశుభ్రత వంటి వాటి పై ఆరా తీశారు. ప్రతి రోజు ఆహారం ఎలా ఉంటుంది అని సౌజన్య అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి క్యాంటీన్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రత, మెయింటెన్స్ వంటి వాటి పై ఆమె పలు సూచనలు చేశారు. ప్రజలకు ఆహారాన్ని వడ్డించేటప్పుడు పరిశుభ్రంగా ఉండాలని చేతులకు గ్లౌజ్‌లు వంటి వాటిని ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంకే డిస్ట్రిబ్యూషన్ ఇన్చార్జి నరేష్, అడ్వైజర్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



**ప్రకాశం**



**మార్కాపురం**



**బాపట్ల**

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక
08.09.26 మంగళవారం

## ఆహార నాణ్యతలో నిర్లక్ష్యం సహించేది లేదు

**కంభంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు**

**బాలికల పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార నాణ్యత పై పరిశీలన**

**అంగన్వాడీ ఆయా పై ఫిర్యాదుల నేపథ్యంలో చర్యలకు ఆదేశం**



(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 7)
పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు అందించే ఆహారం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కంభం పట్టణంలోని వీవీఎస్ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు పలు అంగన్వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వీవీఎస్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం తయారు చేస్తున్న విధానం, వంటశాల పరిసరాల పరిశుభ్రత, బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల నాణ్యత, వాటి నిల్వలను పరిశీలించారు. పాఠశాలలో ఎగ్స్, రైస్ బ్యాగులు అదనంగా ఉండటంపై ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆహార పదార్థాల నిల్వలు, వినియోగానికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడంలో ఎలాంటి లోపాలు ▶4లో

## వెలిగొండ ప్రాజెక్టు వద్ద పూల సుబ్బయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

**మీడియా సమావేశంలో సీపీఐ జాతీయ నేత డాక్టర్ కె నారాయణ**




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 7)
కరువు కాటకాలతో నతమతమవుతున్న మార్కాపురం జిల్లా ప్రజానీకానికి వరప్రసాదమైన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం తుది శ్వాస వరకు ఉద్యమాన్ని కొనసాగించిన సీపీఐ నేత పూల సుబ్బయ్య విగ్రహాన్ని వెలిగొండ ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన దోర్నాల మండలం గంటవానిపల్లె గ్రామం వద్ద వున్న ఫీడర్ కెనాల్ ను సందర్శించిన అనంతరం స్థానిక స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ అనేక దశాబ్దాల పోరాటాల ఫలితంగానే శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణ పనులు పూర్తి చేసుకొని కృష్ణా జలాలను వెలిగొండ ప్రాజెక్టులోకి విడుదల కావడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం 1984 దశకంలో నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మార్కాపురం వచ్చిన సందర్భంగా సీపీఐ నాయకత్వంలోని ప్రతినిధి బృందం సభ్యులు పూల సుబ్బయ్య, గుజ్జుల యలమందారెడ్డి, రావులపల్లి చెంచయ్య తదితర నాయకులు వెలిగొండ ప్రాజెక్టు ప్రాముఖ్యత గురించి, ఈ ప్రాంతంలోని వర్షాభావ పరిస్థితులు, కరువు కాటకాల గురించి ఆయనకు వివరించడం జరిగిందన్నారు. అందుకు స్పందించిన ఎన్టీరామారావు పూల సుబ్బయ్య పేరుతో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించి సర్వే చేసేందుకు జీవోను కూడా అధికారికంగా విడుదల చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అదే పేరుతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుగా నామకరణం కావడం శుభపరిణామం అని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు సాధనలో ఎవరు అవునన్నా కాదన్నా ఈ క్రెడిట్ అంతా భారత కమ్యూనిస్టు ▶4లో

## వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా, నియమ నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**గణేష్ ఉత్సవాల అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా పొందాలి**

**జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 7)
వినాయక చవితి పర్వదినం, ఉత్సవాల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీస్ అధికారులకు పలు సూచనలు తెలియచేశారు. గణేష్ ప్రతిమలు ఏర్పాటు చేసిన మండపాలతో పాటు ఇతర ప్రదేశాల్లోనూ భద్రతాపరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. నిమజ్జనం జరిగే ప్రదేశాలు, సంబంధిత ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం, గజ ఈతగాళ్లు, వైద్య సిబ్బంది, అగ్నిమాపక పరికరాలు తదితర ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ, పంచాయతీ, మున్సిపాలిటీ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో సజావుగా ముగిసేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 14వ తేదీ నుంచి నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గణేష్ మండపాల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా ఎస్పీ తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటుకు అవసరమైన పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్, పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అనుమ ఓతులను సులభంగా ఒకే వేదిక ద్వారా పొందేందుకు గణేష్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అనుమతుల కోసం ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, ఈ సేవ పూర్తిగా ఉచితమని ఎస్పీ స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని, ఉత్సవా లను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆయన కోరారు.

**ఆన్‌లైన్‌లోనే అనుమతులు...**

ప్రజలు గణేష్ ఉత్సవ్.నెట్ అనే వెబ్సైట్ నందు గణేష్ మంటపం ఏర్పాటు చేయదలచిన కమిటి సభ్యుల వివరాలతో పాటు మరికొన్ని వివరాలను నమోదు చేసి దరఖాస్తును, ఈ క్రింది విధంగా దరఖాస్తు చేసుకోవాలి.

**దరఖాస్తు చేసుకునే విధానం ...**

గణేష్ ఉత్సవాల నిర్వహణకు మొదటగా దరఖాస్తు చేయదలచిన వారు వెబ్ సైట్ ఓపెన్ చేసి న్యూ అప్లికేషన్ అనే ఆప్షన్ ను ఎంచుకోవాలి. తరువాత దరఖాస్తు దారుని 4

## భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కంపెనీకి 2500 ఎకరాల భూ కేటాయింపుకు రూ.86 కోట్లు చెల్లించాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 7)
సోమవారం అమరావతి నుండి పరిశ్రమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యువ రాజ జిల్లా కలెక్టర్లతో పరిశ్రమల స్థాపనకై అవసరమైన భూసేకరణ గురించి వీక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు క్యాంపు కార్యాలయం నుండి పాల్గొని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కంపెనీవారు దొనకొండలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు సంబంధించి 2500 ఎకరాల భూమిని కోరి ఉన్నారని దానికి సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అవసరమైన నగదును డిపాజిట్ చేయవలసిందిగా సంబంధిత యాజమాన్యానికి సూచించడం జరిగిందని వివరించారు. అందులో భాగంగా 86 కోట్ల రూపాయలను చెల్లించవలసి ఉందని యాజమాన్యానికి తెలియజేసినట్లు ఆయన తెలిపారు. సదరు భూమిని భారత డైనమిక్స్ లిమిటెడ్ నుండి డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ కు అందజేయాలని సూచించి ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌ఎం ఏపీఐఐసీ మదనమోహన్, తదితరులు పాల్గొన్నారు. ▶4లో

## కార్యకర్తే అధినేత.. ఆర్థికంగా ఎదగాలి

**2040 నాటికి టీడీపీ కుటుంబాల ఆదాయం రూ.75 లక్షలు దాటాలి**

**మంగళగిరి లీడర్‌షిప్ శిక్షణ సదస్సులో ఎమ్మెల్యే ఏలూరి**

(షణ్ముఖ వెలుగు, మంగళగిరి, సెప్టంబర్ 7)
అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా కార్యకర్త వెన్నంటే నిలవడమే తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. కార్యకర్తలకు కేవలం గౌరవం కల్పించడం కాకుండా.. వారిని రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయడమే ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. కార్యకర్త కుటుంబానికి బీమా, విద్య, వైద్యం, ఉపాధి వంటి భరోసా కల్పిస్తూ.. వారి ఆర్థిక ప్రగతికి మార్గం చూపుతున్నారని తెలిపారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ లీడర్‌షిప్ శిక్షణ సదస్సులో 'రాజకీయ, ఆర్థిక సాధికారత' అంశంపై ఏలూరి ప్రసంగించారు.




**కార్యకర్తే పార్టీకి వెన్నెముక**

అధికారంతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజల మధ్య ఉండే లక్షలాది మంది కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన బలమని ఏలూరి అన్నారు. కోటి మందికి పైగా క్రియాశీల సభ్యులతో ప్రజలతో మమేకమై పనిచేస్తున్న పార్టీ టీడీపీ అని పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి అగ్ర నాయకత్వం వరకు ఇప్పటికే దాదాపు 10 వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలకు సమర్థవంతమైన శిక్షణ అందించామని తెలిపారు. భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు.

**సిఫార్సులకు స్వస్తి.. ప్రతిభకే పెద్దపీట**

కార్యకర్తలకు పదవులు, అవకాశాలు కల్పించడంలో సిఫార్సులకు తావులేకుండా ▶4లో

## వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 7)
వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం తమ సర్వస్వాన్ని, ఇళ్లను, పొలాలను, ఊర్లను త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పేర్కొన్నారు. మార్కాపురం కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం గోగులదిన్నె లేఔట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించబడిన వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసిత సుంకేసుల గ్రామ ప్రజలకు ఇళ్ల పట్టాలు, నిత్యావసర



# కార్యకర్తే అధినేత.. ఆర్థికంగా ఎదగాలి

ప్రతిభకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. నామినేటెడ్ పదవులతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సమర్థత, సేవా తత్వం ఆధారంగా కార్యకర్తలకు అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రాజకీయంగా ఎదగడంతోపాటు కార్యకర్త ఆర్థికంగా కూడా నిలదొక్కుకున్నప్పుడే పార్టీ పునాదులు మరింత బలపడతాయని పేర్కొన్నారు.

**కుటుంబానికి భీమా.. పిల్లలకు విద్య**

మంత్రి నారా లోకేష్ ఆలోచనతో కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం అమలు చేస్తున్నామని ఏలూరి తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన కార్యకర్తల పిల్లలకు ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'న్యూట్రిఫుల్' యాప్, హెల్త్ రికార్డుల ద్వారా కార్యకర్తల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వివరించారు. టీడీపీ సభ్యత్వ కార్డు కేవలం గుర్తింపు కార్డు కాదు.. కార్యకర్త కుటుంబానికి పార్టీ అందించే బీమా, విద్య, వైద్యం, ఉపాధి భరోసాకు ప్రతీక అని ఏలూరి అభివర్ణించారు.

**రూ.75 లక్షల ఆదాయమే లక్ష్యం**

2040 నాటికి రాష్ట్రంలో సాధారణ తలసరి ఆదాయం రూ.50 లక్షలకు చేరుతుందని అంచనా వేస్తున్న నేపథ్యంలో.. టీడీపీ కుటుంబాల ఆదాయం నీతివంతమైన మార్గాల్లో రూ.75 లక్షలు దాటాలన్నదే చంద్రబాబు లక్ష్యం అని ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. కార్యకర్త కుటుంబాలు ఆర్థికంగా బలపడేలా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలపై పార్టీ దృష్టి సారిస్తోందన్నారు.

**సాధారణ కార్యకర్త నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా..**

తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ ఎమ్మెల్యే ఏలూరి భావోద్వేగానికి గురయ్యారు. రాజకీయ నేపథ్యం లేని సాధారణ విద్యార్థి నాయకుడిగా ఉన్న తనకు పర్చూరు ఎమ్మెల్యేగా మూడుసార్లు అవకాశం కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడిదే అని గుర్తుచేశారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తలో నాయకత్వ లక్షణాలను గుర్తించి వారికి అవకాశాలు కల్పించడమే టీడీపీ విధానమని అన్నారు.

**ఓటమి.. గెలుపు కార్యకర్తల ఆత్మగౌరవం**

ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపోటములు వ్యక్తిగత అంశాలు కాదని ఏలూరి స్పష్టం చేశారు. అవి నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త ఆత్మగౌరవానికి సంబంధించినవని పేర్కొన్నారు. అందుకే ప్రతి కార్యకర్త పార్టీని సొంత బాధ్యతగా భావించి ప్రజల్లో నిరంతరం పనిచేయాలని పిలుపునిచ్చారు.

**నెక్స్ట్ జనరేషన్ నాయకత్వమే లక్ష్యం**

నారా లోకేష్ నేతృత్వంలో 'కార్యకర్తే అధినేత' అనే సిద్ధాంతంతో నెక్స్ట్ జనరేషన్ నాయకత్వాన్ని తయారు చేస్తున్నామని ఏలూరి తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ నాయకత్వ అవకాశాలు కల్పిస్తూ..

భవిష్యత్ తరాలకు బలమైన రాజకీయ పునాది నిర్మిస్తున్నామని చెప్పారు. 'నా దేశం-నా బాధ్యత' స్ఫూర్తితో ప్రతి కార్యకర్త 'నా తెలుగుదేశం-నా బాధ్యత' అనే నినాదంతో ముందుకు సాగాలి అని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు. కార్యకర్త సంక్షేమం, కుటుంబ ఆర్థిక ప్రగతి, రాజకీయ సాధికారతకు పెద్దపీట వేస్తూ టీడీపీని మరింత బలమైన ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

# భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కంపెనీకి 2500 ఎకరాల భూ కేటాయింపుకు రూ.86 కోట్లు చెల్లించాలి



# వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా, నియమ నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

మొబైల్ నెంబర్ ను ఎంటర్ చేయవలయును. తరువాత సదరు మొబైల్ నెంబర్ కు వచ్చిన ఓటిపిని నమోదు చేయాలి. ఆ తరువాత దరఖాస్తు దారుని పేరు, అడ్రస్, కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేయు ప్రదేశం, ఏ పోలీసు స్టేషన్ పరిధి లోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ ఏ సమయంలో చేస్తారు, ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి సబ్మిట్ చేయాలన్నారు. అప్లికేషన్ ఐడి నెం (యూనిక్ ఐడి) జనరేట్ చేయబడి, సదరు దరఖాస్తు పోలీస్ శాఖ యొక్క అనుమతి కోసం వారి లాగిన్స్‌కు వెళుతుంది. అధికారులు ఆ దరఖాస్తును పరిశీలించి, అనుమతించిన తరువాత ఆ వివరాలు వెబ్ సైట్ నందు వచ్చును. దీనికోసం ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదు. అనుమతికి సంభందించిన క్యూ ఆర్ కోడ్ కలిగిన నిరభ్యంతర పత్రాన్ని జారీ (ఎన్‌ఓసి) చేస్తారు. ఈ పత్రాన్ని ప్రింట్ చేసి గణేష్ మంటపంలో ఉంచాలి. గణేష్ ఉత్సవాలు నిర్వహించే కమిటీ నిర్వాహకులు వెబ్సైట్ సేవలు వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణేశులను మాత్రమే ప్రతిష్ఠించాలి.

**కమిటీ నియమనిబంధనలు ఇవే...**

గణేష్ విగ్రహ ప్రతిష్ఠ, పందిళ్ళు, మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందస్తుగా ఒక కమిటీని ఏర్పాటుచేసి, ఆ కమిటీదే అన్ని బాధ్యతలని స్పష్టంగా గుర్తించాలి. పంచాయతీ, మున్సిపాలిటీ, నగర పాలక సంస్థ లేదా ప్రయివేట్ స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే సంబంధిత స్థల యజమాని లేదా సంబంధిత విభాగపు అధికారుల అనుమతి తప్పనిసరి. ఫైర్, విద్యుత్ శాఖల విభాగాలు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా పందిళ్ళు, మంటపాలు వద్ద అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా నివారించడానికి మంటపంలో తగినంత ఇసుక, నీళ్ళ మరియు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు (అగ్ని మాపక పరికరాలు) ఉండాలి. పందిళ్లు లేదా మండపాలలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా విద్యుత్ వైర్లు మరియు ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా, వైరింగ్‌ను నిపుణుల ద్వారా సురక్షితంగా చేయించుకోవాలి. వినాయక చవితి మండపాల వద్ద అధిక శబ్ద కాలుష్యాన్ని కలిగించే స్పీకర్లు వినియోగించకూడదు. స్పీకర్లు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకే వినియోగించాలి. మైకులో ఎవరైనా కించపరిచే విధంగా వాక్యాలు చేయటం గాని, రెచ్చగొట్టి ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రచారం చేయరాదు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు (ప్రత్యేక స్థలాల వద్ద), పోలీస్ స్టేషన్లు లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద మైక్ ద్వారా ఎటువంటి ప్రచారమూ చేయరాదు. రాత్రి వేళలలో మండపాల వద్ద నిర్వహణ కమిటీ ప్రతినిధులు విధిగా కాపలా ఉండాలి. భద్రతా దృష్టితో, ప్రతి మండపం తమకు తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలి. రాత్రి సమయాలలో పందిళ్లు, మంటపాలలో విలువైన వస్తువులు ఉంచకూడదు. ఉత్సవాలు జరుగుతున్న ప్రదేశంలో కమిటీ సభ్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. భద్రతా పరిరక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. వినాయక పందిళ్లు లేదా విగ్రహాలను రోడ్డుపైన ఏర్పాటు చేయరాదు. బ్యానర్లు లేదా ఫ్లెక్సీలు రాకపోకలకు అంతరాయంగా రోడ్లపై ఉంచకూడదు. వినాయక చవితి ఉత్సవాల సమయంలో బాణసంచా వాడకూడదు. పందిళ్ల వద్ద, ఊరేగింపు సమయంలో అనుచిత ప్రదర్శనలు, అసభ్య నృత్యాలు జరగకుండా ఉండే విధంగా ఉత్సవ నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి మరియు బాధ్యత వహించాలి. ఊరేగింపు సమయంలో పోలీసుల అనుమతి లేకుండా వేషధారణలు, ఎక్కువ శబ్ధము వచ్చే వాయిద్యాలు అనగా డిజే, తదితరాలకు అనుమతి ఉండదు. నిమజ్జన ఊరేగింపుకు అనుమతించిన సమయం, నిమజ్జనకు కేటాయించిన ప్రదేశం, అలాగే ఊరేగింపుకు కేటాయించిన మార్గాలలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి.

**సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దు...**

సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, నిర్ధారణ లేని వార్తలు, రెచ్చగొట్టే పోస్టులను నమ్మవద్దని, వాటిని ఫార్వర్డ్ చేయవద్దని ఎస్పీ సూచించారు. ఏదైనా అనుమానం లేదా సమస్యలు ఉంటే స్థానిక పోలీసులను సంప్రదించి వాస్తవాలను నిర్ధారించుకోవాలని కోరారు. జిల్లా ప్రజలు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు,యువత, మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల వారు పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు. ఎక్కడైనా సమస్యలుంటే అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266కు లేదా స్థానిక పోలీసులను గాని సంప్రదించాలని సూచించారు.

# వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం



వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించి, నిర్వాసితులకు పట్టాలు మరియు సహాయ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడాతూ నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను వేగంగా తీసుకురావడం కోసం 11 గ్రామాల ప్రజలు తమ సర్వస్వాన్ని త్యాగం చేసి వేర్వేరు ప్రాంతాలకు తరలివెళ్లారని, వారిని ఆదుకోవడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిర్వాసిత కుటుంబాలకు అదనపు సహాయం అందించడానికి ప్రత్యేక జీవోను జారీ చేయడం జరిగిందన్నారు. నిర్వాసితులకు ఇళ్ల పట్టాల పంపిణీ చేయడంతో పాటు 25 కేజీల నాణ్యమైన బియ్యం,2 కేజీల వంటనూనె, చక్కెర, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, తదితర నిత్యావసర వస్తువులు అందజేశారు. మహిళలకు చీర, గాజులు, పసుపు, కుంకుమ, పశు పోషణ కోసం దాణా పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టాల పంపిణీ, పత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసేందుకు సుమారు 26 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్వాసితులకు అవసరమైన పునరావాస ప్రాంతాలలో తాగునీరు, విద్యుత్ వంటి అన్ని రకాల ప్రాథమిక మౌలిక సదుపాయాలను వేగంగా పూర్తి చేయడానికి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. పండగ వాతావరణంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో సుంకేసుల గ్రామ ప్రజలందరికీ భోజన వసతితో పాటు సమగ్ర ఏర్పాట్లు చేశామని, పట్టాల పంపిణీ పూర్తయ్యే వరకు ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, సుంకేసుల గ్రామ నిర్వాసిత ప్రజలు పాల్గొన్నారు.

# వెలిగొండ ప్రాజెక్టు వద్ద పూల సుబ్బయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

పార్టీకే చెందుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎన్టీరామారావు దగ్గర నుంచి చంద్రబాబు నాయుడు, డాక్టర్ వైయస్ రాజశేఖర్రెడ్డి, జగన్మోహన్రెడ్డిలు ఎవరిపాత్ర వారు పోషించి ఈ గొప్ప కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారని వారందరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు ఒక సొరంగం ద్వారా నీరు నరిపోదని రెండవ సొరంగం నిర్మాణం చేపట్టాలని సీపీఐ ఉద్యమం ఫలితంగానే అది సాధ్యమైందని అన్నారు. మొదటి దశ నిర్మాణ పనులు పూర్తి కావడం సంతోషమేనని, అలాగే రెండవ దశ నిర్మాణ పనులు కూడా వేగవంతంతో పూర్తి చేయాలని అప్పుడే ఈ ప్రాంతానికి పరిపూర్ణంగా న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 32 మండలాలు సస్యశ్యామలం కావడంతో పాటు 20 లక్షల మందికి డ్రింకింగ్ వాటర్ అందుతుందని, దీంతో ఫ్లోరైడ్ సమస్య కూడా పరిష్కారం అవుతుందని ఆయన అన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ప్రాంతంలో వేసిన పంటలు పండక, వంటకోసం తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు అనేక కష్ట నష్టాలను, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ప్రాంతానికి వస్తున్న కృష్ణా జలాల ద్వారా వెనుకబడిన మార్కాపురం జిల్లా భవిష్యత్తులో ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఆయన అన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు మొదట శ్రీకారం చుట్టిన ఘనత ఎన్టీరామావుకే దక్కుతుందని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు సాధనలో సీపీఐ పోరా టాలు, త్యాగాలు మరువలేనివని అన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు పెద్ద ఎత్తున వలసలు ఉండేవని, వెలిగొండ ప్రాజెక్టు కు నీరు రావడం ద్వారా మార్కాపురం జిల్లాలో భవిష్య త్తులో వ్యవసాయరంగ ఉత్పత్తులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అన్నారు.ప్రాజెక్టు నిర్మా ణం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉండాలని అన్నారు. ఆర్ఆర్ ప్యాకేజీ అందని నిర్వాసితులకు వెంటనే మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నయ్యద్ యాసిన్, కెవీ కృష్ణగౌడ్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, పార్టీ నాయకులు అందె నాసరయ్య, నియోజకవర్గ సెక్రటరీ ఎస్ కె కాశిం, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కళ్యాణ్, పార్టీ నాయకులు వై రవీంద్రబాబు, బాణాల రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆహార నాణ్యతలో నిర్లక్ష్యం సహించేది లేదు

లేకుండా చూడాలని పాఠశాల సిబ్బందికి ఆయన సూచించారు. వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆహార పదార్థాలను నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని ఆదేశించారు.



**అంగన్వాడీ కేంద్రంలో ఫిర్యాదులపై ఆరా**

అనంతరం కంభం పట్టణంలోని కందులాపురం కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, గుడ్లు, ఇతర ఆహార పదార్థాల నిల్వలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలోని ఆయాపై పలువురు చేసిన ఫిర్యాదులపై ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆరా తీశారు. ఫిర్యాదులపై స్పందించిన ఆయన, ఆయాపై వచ్చిన ఆరోపణలను పరిశీలించి ఆమెను విధుల నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆయన హెచ్చరించారు. చిన్నారులకు అందుతున్న ఆహార పదార్థాలను సక్రమంగా నిల్వ చేయడంతో పాటు కేంద్రాల్లో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న సేవలు, ఆహార పంపిణీ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై కూడా ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని విజయప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆకస్మిక తనిఖీలతో కంభం మండలంలోని సంబంధిత పాఠశాలలు, అంగన్వాడీ సిబ్బందిలో అప్రమత్తత నెలకొంది. తనిఖీల సమయంలో సంబంధిత అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అంకయ్యకి నివాళి అర్పించిన జాలిరెడ్డి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 7)

ఇటీవల అనారోగ్యంతో మరణించిన అలగాయపాలెం గ్రామ పెద్ద కాపు వాయల వెంకటేశ్వర్లు కుమారుడు అంకయ్య చిత్ర పటానికి వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి నివాళులర్పించారు. అనంతరం అంకయ్య తండ్రికి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వాయల అంకయ్య పిల్లలకు భవిష్యత్తులో విద్యాపరంగా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా నిచ్చి, అంకయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. జాలిరెడ్డితో పాటు ఆ కుటుంబాన్ని పరామర్శించిన తెడ్డు శ్రీనివాసులరెడ్డి కూడా వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. పరామర్శించి నివాళులర్పించిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ కొక్కిలగడ్డ వెంకటకృష్ణారావు, గ్రామ అధ్యక్షులు రామాల కృష్ణారెడ్డి, పీతా రామకృష్ణ, కటారి శ్రీకాంత్, నల్లపరెడ్డి సుధాకర్‌రెడ్డి, కటారి తిరుపతి, వాయల బాబు, తదితరులు ఉన్నారు.





# సినీరంగంలో ఎదురులేని కళాకారిణి భానుమతి రామకృష్ణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 7)

సినీ రంగంలో ఎదురులేని కళాకారునిగా తన ప్రతిభ చాటుకున్నటువంటి మహోన్నత వ్యక్తి భానుమతి రామకృష్ణ పద్మశ్రీ డాక్టర్ భానుమతి రామకృష్ణ జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఇటీవలే భానుమతి రామకృష్ణ విగ్రహం పెట్టడం జరిగింది. సోమవారం బ్రాహ్మణ మహిళలు అందరు వెళ్లి ఆమెకి నివాళులర్పించారు. ఆమె ప్రకాశం జిల్లా వాసి అవడం అందరు గర్వించదగ్గ విషయం సినీ రంగంలో ఎదురులేని కళాకారునిగా తన ప్రతిభ చాటుకున్నటువంటి మహోన్నత వ్యక్తి భానుమతి రామకృష్ణ విగ్రహానికి పూలమాలవేసి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పాలకమండలి సభ్యురాలు కామరాజు గడ్డ కుసుమకుమారి, శివాలయం పాలకమండలి సభ్యురాలు సాక్షి, సుజాత, కొణిజేటి మారుతి, వినయ్ కుమార్, వనజ, అనంతలక్ష్మి, ఫణి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## రూ.15 వేలు పింఛన్ మంజూరు చెయ్యాలని కుక్కమూడి ప్రసాద్ విజ్ఞప్తి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టంబర్ 7)
దుర్గి మండలం చంద్ర కుంట తండా సుగాలి కులానికి చెందిన హర్షవర్ధన్ నాయక్ వయస్సు 8 సంవత్సరాలు మెంటల్ రిటార్డేషన్ (జీవితకాలం బుద్ధి మాణ్యత) వైకల్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమై ఇబ్బందులు పడుతున్నాడని సదరం సర్టిఫికెట్ 100% ఉన్న అతనికి రూ.6,000 పింఛన్ మాత్రమే వస్తుందని ప్రభుత్వ నిబంధనల ప్రకారం శాశ్వతంగా మంచానికి పరిమితమై 100% సదరం సర్టిఫికెట్ ఉన్నవారికి రూ.15 వేలు పించన్ ఇచ్చే విధంగా నిబంధనలు ఉన్నాయని హర్షవర్ధన్ నాయక్ కు రూ.15వేల పింఛన్ మంజూరు చేయాలని పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్ల కు విజ్ఞప్తి చేశారు. సోమవారం పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కలెక్టరేట్ లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన బాధితులతో కలిసి కలెక్టర్ కు అర్జీ అందజేశారు. కలెక్టర్ సమస్య పై సానుకూలంగా స్పందించి డిఎంహెచ్ఓను పిలిపించి ఆయనతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూడాలని కలెక్టర్ ఆయనకు తెలియజేశారని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌తో పాటు హర్షవర్ధన్ నాయక్ తల్లిదండ్రులు ఉన్నారు.

## మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

**ఒక్కొక్కరికి రూ 50 లక్షల పరిహారం ఇవ్వాలి**
**సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ డిమాండ్**



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 7)
ఈ నెల 5 వ తేదీ దోర్నాల మండలం కటకానుపల్లె గ్రామంలో పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందిన వినయ్ కుమార్ (22), రాజ్ కుమార్ (23) కుటుంబాలను ఆదుకోవాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ను కోరారు. సోమవారం సాయంత్రం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కేవివి ప్రసాద్, జిల్లా పార్టీ కార్యదర్శి ఎంఎల్ నారాయణ లతో కలిసి డాక్టర్ కె నారాయణ కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులును కలిశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే యువకులు మృత్యు వాతకు గురికావడం చాల బాధాకరమని, ఈ పరిస్థితుల్లో ఒక్కొక్క మృతుని కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల నిర్వాసితులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ కె నారాయణ వెంట పార్టీ నాయకులు అందె నాసరయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల ప్రభాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కల్యాణ్, తదితరులు ఉన్నారు.

## డీజేలు పెడితే చర్యలు తప్పవు సీఐ మల్లికార్జున
## శాంతియుతంగా వినాయక చవితి పండుగ జరుపుకోవాలి




(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 7)
జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు వినాయక చవితి పండుగ సందర్భంగా కంభం సర్కిల్ పరిధిలోని ప్రజలు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని కంభం సీఐ కె మల్లికార్జున కోరారు. వినాయక మండపాల వద్దగానీ, వినాయక ఊరేగింపుల్లోగానీ డీజేలు ఏర్పాటు చేసేందుకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. డీజేలకు సంబంధించి ఇప్పటికే అడ్వాన్స్ చెల్లించి ఉంటే వెంటనే తిరిగి తీసుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని, ప్రశాంత వాతావరణంలో వేడుకలను నిర్వహించుకోవాలని సీఐ విజ్ఞప్తి చేశారు. మీ భద్రత, మా బాధ్యత అని పేర్కొన్నారు.

# తాగునీటి బోరును పునరుద్ధరించాలి

**ఎంపీడీవోకు ఎస్సీ కాలనీ యువకుల వినతి**





(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, సెప్టంబర్ 7)
పుల్లలచెరువు గ్రామ పంచాయతీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న పంచాయతీ తాగునీటి బోరును పునరుద్ధరించి ఎస్సీ కాలనీ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎస్సీ కాలనీకి చెందిన యువకులు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం 2007 సంవత్సరంలో అప్పటి సర్పంచ్ లింగంగుంట్ల నాగమ్మ ఆధ్వర్యంలో రామానాయుడు చెరువు పక్కన ఉన్న అలుగు వద్ద పంచాయతీ నిధులతో తాగునీటి బోరు ఏర్పాటు చేసి, పైపుల ద్వారా ఎస్సీ కాలనీతో పాటు గ్రామంలోని ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టారు. ఈ బోరు సుమారు 16 సంవత్సరాల పాటు ప్రజలకు తాగునీటిని అందిస్తూ ఎంతో ఉపయోగకరంగా ఉందని వారు తెలిపారు. అయితే ప్రస్తుతం సరైన నిర్వహణ లేకపోవడంతో బోరు చుట్టూ పెద్ద ఎత్తున చెట్లు, పొదలు పెరిగి నిరుపయోగంగా మారిందని యువకులు తెలిపారు. పంచాయతీ ఆధ్వర్యంలో బోరు వినియోగంలో లేకపోవడంతో, బోరు పక్కనే ఉన్న పొలం వారు దానిని మరమ్మతు చేయించుకుని తమ అవసరాలకు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బోరు పంచాయతీ ఆస్తి కాదా, ప్రస్తుతం ఎవరు వినియోగిస్తున్నారు, వారికి అధికారిక అనుమతి ఉందా అనే విషయాలను అధికారులు పరిశీలించాలని వారు కోరారు. ప్రస్తుతం వర్షాలు సరిగా లేకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ముఖ్యంగా ఎస్సీ కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంచాయతీ బోరును తక్షణమే పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీడీవోను కోరారు. అలాగే బోరు చుట్టూ పెరిగిన చెట్లు, పొదలను తొలగించి ప్రదేశాన్ని శుభ్రం చేయించాలని, పంచాయతీ ఆస్తిని అనుమతి లేకుండా ఎవరైనా వినియోగిస్తున్నట్లయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఎస్సీ కాలనీ ప్రజల తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని యువకులు విజ్ఞప్తి చేశారు.

# నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని కలెక్టరేట్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 7)
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వలన నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటు తున్నాయని ధరల పెరుగుదల వలన సామాన్య ప్రజల జీవనం అగమ్యగోచరంగా మారిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద నిత్యవసర సరుకులను ప్రదర్శిస్తూ సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఐద్వా జిల్లా నాయకురాలు యస్‌కె మల్లిక అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ ధరలు పెరుగుదలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఐద్వా నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత నెల రోజులుగా అన్ని నిత్యవసర సరుకులు ధరలు దాదాపు 50% పైగా పెరిగాయని అన్నారు. ఉపాధి లేక జీవనం ఎట్లా అని ప్రజలు ఆందోళన పడుతున్నారని, ఉన్న అరసర ఉపాధితో ప్రజల యొక్క ఆదాయాలు పెరగడం లేదని ఫలితంగా పేద మధ్య తరగతి సామాన్య, ప్రజల యొక్క బ్రతుకులు తీవ్ర ఇబ్బందులకు నెట్టి వేయబడ్డాయని అన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల పనులు లేక కరువు జిల్లాగా ప్రకాశం జిల్లా ఉన్నది. ఈ పరిస్థితుల్లో తక్షణమే నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, రేషన్ డిపోల ద్వారా ప్రజలకు అవసరమైన 14 రకాల నిత్యావసర సరుకులను తక్కువ ధరలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తులకు ఆహార పంటలపై హక్కులు కల్పిస్తున్నారని పెద్ద పెద్ద వ్యాపారస్తులు, దళారులు నిత్యవసర సరుకులను బ్లాక్ మార్కెట్లకు తరలించి ధరలు పెరుగుదలకు పాల్పడు తున్నారని విమర్శించారు. ధరలు పెరుగుదలను అరికట్టక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి జి ఆదిలక్ష్మి, జిల్లా కోశాధికారి బి.రాజలక్ష్మి, మాట్లాడారు. ధర్నా అనంతరం కలెక్టర్ రాజాబాబు గారికి ఐద్వా బృందం వినతి పత్రం ఇవ్వటం జరిగింది. కలెక్టర్ స్పందిస్తూ ఈ డిమాండ్స్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు కె రాజేశ్వరి, యం పద్మ, యస్ విజయలక్ష్మి, ఏ విశ్రాంత, ఎస్‌కె మస్తాన్, బివిఎస్‌డి అమీరున్నీస్సా, బి రంగమ్మ, జి నాగేశ్వరమ్మ, ఏ అంజమ్మ, ధనలక్ష్మి, ఎస్‌కె పర్వీన్, మాధవి, కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**
**ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ చర్యల పై ప్రజల్లో అవగాహన పెంచాలి**





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టంబర్ 7)
ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకతతో పాటు ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని "ఎల్‌నినో" వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ చర్యలు, సాగు విధానాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జేసీ డాక్టర్ నిధి మీనాతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో జిలా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే తగిన పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ వ్యవస్థ పై అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. ప్రజల్లో పీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిగతులను టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

**ఎల్ నినో ప్రభావంపై ప్రజల్లో అవగాహన పెంచాలి..**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ చర్యలు, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై జిల్లా ప్రజలు, రైతుల్లో అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. వాతావరణ మార్పులు అనుగుణంగా పంటల సాగు, ప్రకృతి వ్యవసాయ విధానాలు, సేంద్రియ ఎరువుల వినియోగం, భూగర్భ జలాల సంరక్షణ, భూతాపాన్ని తగ్గించే చర్యలు, సాగు మరియు తాగునీటి పొదుపు వంటి అంశాలపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రైతులు, ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, డీసీవో వెంకట సుబ్బయ్య, డిప్యూటీ కలెక్టర్లు జాన్ ఇర్విన్, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలనే లక్ష్యంతో 'మీ కోసం' కార్యక్రమాన్ని నిర్వహించిన మార్కాపురం జిల్లా పోలీసులు

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు 46 ఫిర్యాదులు**



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 7)
ప్రజా ఫిర్యాదులను పరిష్కారించుటయే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మార్కాపురం జిల్లా ఓఎస్డీ (అడ్మిన్) నవజ్యోతి మిశ్రా పోలీసు అధికారులతో కలిసి సోమవారం మార్కాపురం జిల్లా పోలీసు కార్యాలయంలో "మీకోసం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదిదారుల నుంచి అధికారులు వ్రాతపూర్వక వినతులను స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో విచారణ చేపట్టి సత్వర పరిష్కారం అందించేలా చర్యలు తీసుకుంటామని ఫిర్యాదిదారులకు భరోసా కల్పించారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో అధికారులు మాట్లాడి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే విచారణ చేపట్టి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ పరిష్కార వేదికకు సోమవారం 46 అర్జీలు అందాయి. జిల్లా పోలీసు కార్యాలయానికి వ్యక్తిగతంగా హాజరుకాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీసు స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు లేదా సబ్-డివిజన్ కార్యాలయాల ద్వారా కూడా అందజేయవచ్చు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివాదాలు, చీటింగ్, కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసుల అప్రమత్తతో తప్పిన ప్రాణాపాయం

**మద్యం మత్తులో భార్యను బెదిరించడానికి చేసిన ప్రయత్నం**
**మద్యానికి బానిసై రోజు వేదిస్తున్నడని భార్య ఫిర్యాదు**
**విచారణ సమాచారం భర్త తల్లికి తెలిపిన పోలీసులు**
**కొనకనమిట్ల పోలీస్ స్టేషన్ బయట ఆత్మహత్య యత్నం పై స్పందించిన సిఐ రాజేష్ కుమార్**






(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, సెప్టంబర్ 7)
కొనకనిమట్ల పోలీస్ స్టేషన్ బయట ఒక వ్యక్తి చొక్క పై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన పై పొదిలి సిఐ ఎం రాజేష్ కుమార్ స్పందించారు. కొనకనమిట్ల మండలం నాగంపల్లి గ్రామానికి చెందిన యువతితో ఆరు సంవత్సరాల క్రితం జగదీశ్ అనే వ్యక్తికి వివాహమైంది. వీరికి రెండు సంవత్సరాల బాబు ఉన్నాడు. గత కొంత కాలంగా మద్యం సేవించి భార్యను హింసిస్తుండటంతో భార్య కొనకనమిట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. జగదీష్ తల్లికి ఈ నెల 7న కౌన్సిలింగ్‌కు రావాలని సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. కౌన్సిలింగ్ కొసం యువతి ముందుగానే పోలీస్ స్టేషన్‌కు హాజరై స్టేషన్ బయట ఉందన్నారు. భార్యను భయపెట్టలనుకున్న జగదీష్ ముందుగానే పెట్రోల్ చొక్కా పై చల్లుకొని దాని పై మరో జెర్కిన్ వేసుకొని భార్యను నువ్వ నా పై పెట్టిన కేసు విత్ డ్రా చేసుకొని నాతో పాటు రావాలని డిమాండ్ చేశాడు. అప్పటికి అతని వేధింపులకు విసిగిన యువతి నువ్వు మద్యం మానేస్తాననంటే కాపురానికి వస్తానని చెప్పడంతో భార్యను భయపెట్టాలని లైటర్ ద్వారా చొక్కాను అంటించుకున్నాడు. దీంతో చుట్టు ప్రక్కనున్న గ్రామస్థులు గట్టి గట్టిగా అరవడంతో స్టేషన్లో ఉన్న పోలీసులు అప్రమత్తమై మంటాలను ఆర్పి వెంటనే పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. పోలీసులు తక్షణమే స్పందించడంతో అతడిని ప్రాణాపాయ పరిస్థితిని నుంచి కాపాడడం జరిగిందని సిఐ రాజేష్ కుమార్ మీడియాకు వివరించారు.

## వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

### సింగిల్ విండో విధానంలో ఉచితంగా అనుమతులు పొందాలి

### ఎస్ఐ సాంబశివరావు



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, సెప్టంబర్ 7)**

వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నియమ నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పుల్లలచెరువు ఎస్ఐ బి సాంబశివరావు తెలిపారు. సెప్టెంబర్ 14 నుంచి నిర్వహించనున్న గణేష్ ఉత్సవాలకు మండపాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా పొందాలని సూచించారు. పోలీస్, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అనుమతులను గణేష్ ఉత్సవ్.నెట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా పొందవచ్చన్నారు. దరఖాస్తుదారులు వెబ్‌సైట్‌లో మొబైల్ నంబర్, ఓటిపి నమోదు చేసి కమిటీ సభ్యులు, మండపం ప్రదేశం, విగ్రహం ఎత్తు, నిమజ్జనం తదితర వివరాలను నమోదు చేయాలని తెలిపారు. అనుమతి లభించిన అనంతరం క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్ఓసి ని డౌన్‌లోడ్ చేసుకుని మండపంలో ఉంచుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణేశ విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలని కోరారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా ఇసుక, నీరు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌కు అవకాశం లేకుండా నిపుణులతో సురక్షితంగా వైరింగ్ చేయించుకోవాలన్నారు. స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని, అధిక శబ్దానికి తావివ్వరాదన్నారు. కించపరిచే, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రార్థనా స్థలాలు, పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మైక్ వినియోగించరాదని సూచించారు. మండపాల వద్ద రాత్రివేళ కమిటీ సభ్యులు భద్రత కోసం అందుబాటులో ఉండాలని, వీలైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వినాయక మండపాలు, విగ్రహాలను రోడ్డుపై ఏర్పాటు చేయరాదని, రాకపోకలకు ఇబ్బంది కలిగించే బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దన్నారు. ఉత్సవాల్లో బాణసంచా, అనుచిత ప్రదర్శనలు, అసభ్య నృత్యాలకు తావివ్వరాదని తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఊరేగింపుల్లో డీజేలు, అధిక శబ్దం చేసే వాయిద్యాలు వినియోగించరాదన్నారు. నిమజ్జనానికి కేటాయించిన సమయం, ప్రదేశం, మార్గాలను తప్పకుండా పాటించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, నిర్ధారణ లేని వార్తలు, రెచ్చగొట్టే పోస్టులను నమ్మవద్దని, ఫార్వర్డ్ చేయవద్దని ఎస్ఐ సూచించారు. ఏదైనా సమస్య లేదా అనుమానం ఉంటే వెంటనే స్థానిక పోలీసులను సంప్రదించాలని కోరారు. మండల ప్రజలు, ఉత్సవ కమిటీలు, యువత, మత పెద్దలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

## నేషన్ బిల్డర్ అవార్డు ప్రధానం

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టంబర్ 7)**



రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల వారు ప్రతి సంవత్సరం అందించే నేషన్ బిల్డర్ అవార్డు లను ప్రధానం చేయుటలో భాగంగా సోమవారం గవర్నమెంట్ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఎత్తిపోతలలో జరిగినటువంటి ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల యందు సాంఘిక శాస్త్ర అసిస్టెంట్‌గా, ద్వితీయ ప్రధానోపాధ్యాయురాలుగా పని చేయుచున్న, రాగిడి నాగమల్లేశ్వరిని నేషన్ బిల్డర్ అవార్డుతో ఘనంగా సత్కరించడం జరిగింది. వీరితో పాటుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికైన భౌతిక శాస్త్ర అసిస్టెంట్ పి. సుజాతను, జిల్లాస్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలుగా ఎన్నికైన జి దుర్గా భవానిని, జిల్లా ఉత్తమ స్కూల్ అసిస్టెంట్ గా ఎన్నికైన , బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయిని పి.శిరీషను సత్కరించి, బహుమతులను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ క్లబ్ అధ్యక్షులు పఠాన్ నాగూర్ వలి మాట్లాడుతూ జ్ఞాన వికాసంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, మానవీయత విలువలు వంటి మంచి లక్షణాలను విద్యార్థుల్లో పెంపొందించే దిశలో ఉపాధ్యాయులు ముందుండాలని పిలుపునిచ్చారు . మారుమూల తండాల ప్రాంతం నుంచి వచ్చి చదువుతున్న బాలికలకు అత్యున్నత విద్యతో పాటుగా, ఆరోగ్యంగా ఉండేటట్లుగా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తూ, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించాలని సీనియర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య కోరారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మండల విద్యాధికారి కోటేశ్వరరావు, సాంఘిక సంక్షేమ అధికారి గోవిందు నాయక్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, రోటరీ ఉపాధ్యక్షులు ఆలేటి కోటేశ్వరరావు, ట్రెజరర్ ఆవుల వెంకట వీరాంజనేయులు, సీనియర్ రోటరీ సభ్యులు చెరుకూరి నరసింహారావు, ఇక్కుర్తి శంకర్, మాణిక్యాల బాబు, ఆడిటర్ మస్తాన్వలి ఎంబీఎస్ కోటేశ్వరరావు, శ్రీమతి సారా స్వరూప పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినిలు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులని అలరించాయి. తమ పాఠశాల ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు పొందటంతో హర్షాన్ని ప్రకటిస్తూ, ప్రభుత్వ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.





## పురుగు మందుల అమ్మకాల పై శిక్షణ కార్యక్రమం

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టంబర్ 7)**

పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో మాచర్ల సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల పురుగు మందుల డీలర్లకు సోమవారం వియేటి యాప్ లో పురుగు మందుల అమ్మకాల పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల సహాయ వ్యవసాయ సంచాలకులు వి జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ పురుగు మందుల డీలర్లు అందరూ ఈ యాప్ ను అవగాహన చేసుకొని ఆన్లైన్ విధానంలో అమ్మకాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ టి బాలాజీ గంగాధర్, మండల వ్యవసాయ అధికారి, వెల్దుర్తి వారు ఆన్లైన్ విక్రయ విధానాన్ని డీలర్లకు వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మండల వ్యవసాయ అధికారి డి పాప కుమారి, వ్యవసాయ విస్తరణ అధికారులు యం మార్కండేయులు, ఓ అభిశిక్త వర్మ, యంపిఈఓలు జి ప్రతాప్, యం రాంబాబు నాయక్, మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, రెంటచింతల మండలాల పురుగు మందుల డీలర్లు పాల్గొన్నారు.





## వినాయక మండపాలకు పోలీసు అనుమతి తప్పనిసరి

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

### శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలి

### మార్కాపురం గ్రామీణ ఎస్ఐ వి వేమన




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 7)**

మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామీణ ఎస్ఐ వి వేమన జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పలు సూచనలు చేశారు. వినాయక చవితి పండుగను ప్రతి ఒక్కరూ శాంతియుతంగా, సంతోషంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. అలాగే పై అధికారుల ఆదేశాల మేరకు వినాయక మండపాల వద్ద గానీ, వినాయక ఊరేగింపులో గానీ డిజెలు ఏర్పాటు చేయడానికి ఎటువంటి అనుమతులు లేవు. కావున డిజెలు ఏర్పాటు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. ఇప్పటికే డిజెల కోసం ఏమైనా అడ్వాన్స్ చెల్లించి ఉంటే వెంటనే తిరిగి తీసుకోవాలన్నారు. కనుక పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖకు ప్రతి ఒక్కరూ సహకరించి, అందరూ ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

## మృతదేహం కనిపించినా స్పందించలేదా..?

### అధికారుల తీరుపై బంధువుల ఆగ్రహం

### దళితులమని అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణ



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 7)**

వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్‌లో కొట్టుకుపోయిన వారి మృతదేహాల ఆచూకీ కోసం అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదంటూ బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సోమవారం దోర్నాల-మార్కాపురం ప్రధాన రహదారి పై బంధువులు ధర్నా నిర్వహించి అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. వినయ్ మృతదేహం ప్రవాహంలో కొట్టుకుపోతున్నట్లు కనిపించినప్పటికీ, వెంటనే స్పందించి రక్షణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారని బంధువులు ఆరోపించారు. మృతదేహాలు కొట్టుకుపోయి రోజులు గడుస్తున్నా గాలింపు చర్యలు వేగవంతం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము దళితులం కావడం వల్లే తమ సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ వారి మృతదేహాల ఆచూకీ కనిపెట్టేందుకు తక్షణమే ప్రత్యేక బృందాలతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మృతదేహం కనిపించినా అధికారులు ఎందుకు స్పందించలేదని, బాధిత కుటుంబాల ఆవేదనను ఎందుకు పట్టించుకోవడం లేదని నిరసనకారులు ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

రోడ్డుపై ధర్నా నిర్వహించడంతో దోర్నాల-మార్కాపురం మార్గంలో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు.

## వైభవంగా పల్నాటి వీర అంకమ్మ దేవర సారె

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టంబర్ 7)**

మండలంలోని పెదపల్లిపాలెంలో వేంచేసిన పల్నాటి వీర అంకమ్మ దేవర అషాడ సారెను కర్రి ఇంటీ వంశాస్తులు కోత్తపాలెం పంచాయతీ భాగ్యనగర్‌లోని రామలయం నుండి వందలాది మంది మహిళలు భక్తిశ్రద్ధలతో పసుపు, కుంకుమ, చీరె, గాజులు, నైవేద్యాలతో కూడిన సారె డప్పు వాయిద్యాలు, మంగళవాయిద్యాల మరియు డిజే ల నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. ఈ సందర్భంగా కొత్తపాలెం, చిన్నగంజాం గ్రామల మేదగా పెదపల్లిపాలెం వరకు నిర్వహించిన శోభాయాత్ర కనులవిందుగా సాగింది. ఈ కార్యక్రమంలో కర్రి వంశస్తులు కర్రి వీరయ్య, కర్రి ధనరాజ్, కర్రి నరశింహరావు, వీర రాఘవులు, కర్రి భాస్కరరావు, కర్రి వీరాలు, కర్రి ఏర్రోడు, కర్రి ఈశ్వరరావు, వందలాది మహిళలు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ పెన్షన్లకు చాప చుట్టిన కూటమి ప్రభుత్వం

### ఎస్సీ, ఎస్టీ పెన్షన్ల ఎన్నికల హామీ పై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి స్పందించాలి

### దళిత నేత నీలం డిమాండ్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 7)**

వృద్ధాప్య, వితంతు, వంటరి మరికొన్ని ఇతర కులాలకు కొత్త పెన్షన్లు మంజూరు చేసి ఎన్నికల హామీ లో ఇచ్చిన 50 ఏళ్ళకే ఎస్సీ ఎస్టీ లకు ఇస్తామన్న వృద్ధాప్య పెన్షన్ పథకానికి చంద్రబాబు ప్రభుత్వం చాప చుట్టిందని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర ఆరోపించారు. సోమవారం దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ 2004 ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం 50 యేండ్లు నిండిన ఎస్సీ ఎస్టీలకు వృద్ధాప్య పెన్షన్ ఇస్తామని ప్రకటించిందన్నారు. ఎన్నికల హామీలో లేని పి4 లాంటి పథకాలను కూడా పేదరికం నిర్మూలిస్తామంటూ చంద్రబాబు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిందన్నారు. అలాగే సూపర్ 6 పథకాన్ని కూడా సూపర్ పబ్లిసిటీ ఇస్తు కూటమి ప్రభుత్వం మాటలు కోటలు దాటుతుందన్నారు. గత ప్రభుత్వం అమలు చేయకుండా నిలిపివేసిన 28 ఎస్సీ ఎస్టీ సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తామని ఎస్సీ ఎస్టీ ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వం ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయటం లేదన్నారు. భూములు ఉన్న భూస్వాములకు రైతు భరోసా ఇటీవల చీరాలలో చేనేత కార్మికులకు చేనేత భరోసా పేరుతో కోట్లాది రూపాయలు విడుదల చేసిందన్నారు. అలాగే కూటమి ఓటు బ్యాంక్ కులాలైన గౌడ, మత్స్యకార, చేనేత కులాలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేస్తుందన్నారు. కానీ సొంత ఇండ్ల స్థలాలు, సాగుభూమి కాక స్మశాన భూములు కూడా లేని ఎస్సీ ఎస్టీలకు మాత్రం ఎన్నికల హామీలు పేర్కొన్నట్టు కూటమి ప్రభుత్వం 50 ఏళ్లకు వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయలేదన్నారు. శనివారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ సమీక్ష సమావేశంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్సీ, ఎస్టీ పెన్షన్లపై ప్రకటన చేయలేదన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామితో సహా ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు ఎవరు 50 ఏళ్ళకే ఎస్సీ, ఎస్టీలకు పెన్షన్ల పంపిణీ అమలు పై రెండు సంవత్సరాల తర్వాత కూడా నోరు విప్పలేదు అన్నారు. పెన్షన్ల మంజూరు సంబంధిత శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ఎస్సీ ఎస్టీలకు 50 ఏళ్లకే మంజూరుకు చర్యలు తీసుకోవాలని నీలం నాగేందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మేడికొండ మురళి, మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ పత్రా బంగారం, దేవరపల్లి గోపి. తదితరులు ఉన్నారు.

## ప్రతి సమస్య పరిష్కారమే పల్లె వీక్షణ లక్ష్యం



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, సెప్టెంబర్ 7)**
స్థానిక స్వర్ణ గ్రామం కార్యాలయంలో కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు సోమవారం తాసిల్దార్ వి పుల్లారావు ఆధ్వర్యంలో పల్లె వీక్షణ కార్యక్రమం నిర్వహించారు. తాసిల్దార్ పుల్లారావు మాట్లాడుతూ పల్లె వీక్షణ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడం దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సాధించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పల్లె వీక్షణలో భాగంగా వివిధ సమస్యలపై 44 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ, ఎంపీటీసీ గంధం స్వప్న మండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ మురళీమోహన్, ఎంపీడీవో సతీష్ బాబు, ఎంఈఓ రవిచంద్రబాబు,వైద్యాధికారి సునీల్ రెడ్డి, పశువైద్యాధికారి శివరామకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన, మహేందర్‌రెడ్డి, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు

## దళిత సీనియర్ నేతకు టీడీపీ నేతల శుభాకాంక్షలు

### టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, సెప్టంబర్ 7)**
పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ దళిత సీనియర్ నాయకుడు మెడబలిమి అచ్యుత్‌రావు పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి కేక్ కట్ చేయించి అచ్యుత్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ షేక్ ఇస్మాయిల్, షేక్ మస్తాన్ వలి, మాజీ ఎంపీపీ మంత్రు నాయక్, మాజీ సర్పంచ్ కంచర్ల సత్యనారాయణ గౌడ్, వేగినాటి ఆత్మానంద శ్రీనివాస్, పేరం రమణారెడ్డి, నారాయణరెడ్డి, ఆకుల రమేష్, చేదురి గంగయ్య, చిదేళ్ల నాగేశ్వరరావు, నక్కా రాములు, సుబ్బారావు, కిష్టయ్య, చేదూరి కిషోర్‌తో పాటు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అచ్యుత్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## వాసవి మహిళ విజన్ క్లబ్, కేసిజిఎఫ్ యూత్ ఆధ్వర్యంలో ఉబ్బా అశోక్ కి సన్మానం





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 7)**
కెసి గుప్తా జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా వాసవి మహిళ విజన్ క్లబ్, కేసిజిఎఫ్ యూత్ ఆధ్వర్యంలో ఫిలిసిటేషన్ టు జర్నలిస్ట్ డేని పురస్కరించుకొని షణ్ముఖ వెలుగు దినపత్రిక ఫోటో జర్నలిస్ట్ ఉబ్బా అశోక్ బాబు గారికి సన్మానం నిర్వహించడం జరిగింది పలువురు వాసవి క్లబ్ సభ్యులు మాట్లాడుతూ సమాజానికి నిజమైన సమాచారాన్ని అందిస్తూ, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్ట్ లను సన్మానించడం చాలా సంతోషకరమని అన్నారు. జర్నలిజం రంగంలో అశోక్ సేవలను అభినందిస్తూ వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్ ఐఈసీ కనమర్ల పూడి హరిప్రసాద్ రావ్, సిఎస్ చలువాది బాలసుబ్రమణ్యం, ఐపీసీ టంగుటూరి రంగస్వామి, అర్‌సి అమరా లక్ష్మీ వెంకట సత్యనారాయణ, ఆర్‌ఎస్ విస్సంశెట్టి అనిల్ కుమార్, జెడ్‌సి 2 దోరడ్ల శ్రీనివాసరావ్, సిజెఎస్ కనమర్ల పూడి వాసవి ప్రియదర్శిని, డిఓ గాధం శెట్టి సాయి సతీష్ కుమార్, డిఓ మువ్వల నాగరాజు, సిఓ ప్రెసిడెంట్ శిఖకొల్లి సత్యం, తదితరులు పాల్గున్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
### కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు లోబడి విగ్రహాల తయారీ జరగాలి







**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టంబర్ 7)**
పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పర్యావరణ సహిత, ఆరోగ్యకర ఆహ్లాదకర వాతావరణంలో శాంతియుత ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను జరిగేలా ప్రజల్లో అవగాహన పెంచాలని చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డాక్టర్ నిధీమీనా, సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, ఏఎస్పీ విభూకృష్ణ, డిఆర్వో మల్లికార్జునుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ శాంతియుత ఆనంద వాతావరణంలో గణేశ చతుర్థి ఉత్సవాలను నిర్వహించుకుకోవాలని శాంతి కమిటీ సంఘం సభ్యులను ఆదేశించారు. అందు కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. మత సామరస్యానికి ప్రతీకగా అన్ని మతాల ప్రజల సహకారంతో గణేష్ ఉత్సవాలలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉత్సవాలు జరిగేలా చూడాలన్నారు. నిమజ్జనం మార్గంలో కరెంట్ తీగలు, కేబుల్ వైర్ లు అడ్డు రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రాంతాల్లో క్రేన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అలాగే.. అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గణేష్ ఉత్సవాలకు సంబంధించి.. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే.. వెంటనే అధికారులకు, పోలీసు సిబ్బందికి సమాచారమివ్వాలన్నారు. అనవసరమైన విషయాలను అత్యుత్సాహంతో.. సోషల్ మీడియాలలో పోస్టు చేయడం వంటి చర్యలను అరికట్టేలా శాంతి కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్ శాఖ ఇచ్చే సూచనలను తప్పక పాటించాలన్నారు. ముఖ్యంగా డీజేలు, సౌండ్ పొల్యూషన్ లేకుండా నియంత్రించాలన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణకు మట్టితో చేసిన ఉత్సవ విగ్రహాలను మాత్రమే వినియోగించేలా ప్రజాల్లో అవగాహన పెంచాలన్నారు. అందుకోసం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన నిబంధనల మేరకు.. ముందస్తుగా విగ్రహాల తయారీదారులకు హెచ్చరికలు జారీ చేశామని, పివోపి తయారీని అరికట్టి పర్యావరణ సహిత మట్టిబొమ్మలను మాత్రమే తయారు చేసి అమ్మకాలు చేపట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల పరిధిలో మట్టివిగ్రహాలను వాడి పూజలు చేసి నిమజ్జనం చేసేలా ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన పెంచాలన్నారు. అందుకోసం పాఠశాలల్లో, పబ్లిక్ లో పోస్టర్లు, కరపత్రాలు, మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. పివోపి విగ్రహాల వాడకం వల్ల పర్యావరణానికి జరిగే అనర్థాలు, మట్టి విగ్రహాల వాడకం వల్ల జరిగే లాభాల గురించి తెలియజేయలన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ధిక్కార చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎన్ఫోర్స్మెంట్ టీమ్ కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసు ఎన్ఫోర్స్మెంట్ టీమ్ సమన్వయంతో పనిచేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ జిల్లాలో వినాయక చవితి పండుగను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తి భావంతో జరుపుకునేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు, శాంతిభద్రతలకు, మతసామరస్యానికి ఇబ్బంది కలగకుండా వినాయక ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ప్రాంతాల, వీధుల వారీగా ఏర్పాటు చేస్తున్న ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు ముందస్తుగా స్థానిక సిహెచ్‌ఓల వద్ద అనుమతులు పొందాలన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన నియమ నిబంధనలను ఉత్సవ కమిటీ సభ్యులు ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని, శాంతి కమిటీ సభ్యులను ఎస్పీ కోరారు. వినాయక ఉత్సవ పందిళ్ళ వద్ద కానిస్టేబుల్, హోంగార్డు మొదలైన భద్రత సిబ్బంది పర్యవేక్షణ తప్పకుండా ఉంటుందన్నారు. పండుగను శాంతియుతంగా నిర్వహిస్తారనే నమ్మకం ఉందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గణేష్ ఉత్సవాలలో పోలీసు అధికారులను ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని డీజే సౌండ్ పొల్యూషన్ లను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉత్సవ విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి.. ముందస్తు అనుమతులు తప్పనిసరి అన్నారు. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు, పోలీసు సిబ్బందికి సమాచారమివ్వలన్నారు. వినాయక ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చే సూచనలను తప్పక పాటించాలన్నారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణలో శాంతి భద్రతల ఏర్పాట్లపై పలువురు శాంతి కమిటీ సభ్యుల అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. సమావేశంలో శాంతి కమిటీ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, నాలుగు డివిజన్ల ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎస్జీవోలు, సంబందిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కారించాలి

### ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు
### మీకోసం కు 100 ఫిర్యాదులు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 7)**
ప్రకాశం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను పూర్తిగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో సమగ్రంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని బాధితులకు ఎస్పీ భరోసా కల్పించారు. మీకోసం కు 100 ఫిర్యాదులు అందాయి. అనంతరం ఆయా ఫిర్యాదుల పై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి 'మీకోసం' కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఫిర్యాదులపై చట్టప్రకారం సమగ్ర విచారణ జరిపి, ఫిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకంగా వికలాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్కువ భూ వివాదాలు, కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, చీటింగ్, జాబ్ ఫ్రాడ్, ఇతర సమస్యల గురించి ప్రజా పిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఒంగోలు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ హాజరత్తయ్య, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, వివిపాలెం ఎస్ఐ ప్రేమ్ కుమార్, ప్యానెల్ అడ్వొకేట్ బి బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ యాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.




## వినాయక మండపాలకు పోలీసు అనుమతి తప్పనిసరి

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
### శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలి
### ఎస్ఐ ఎం దేవకుమార్



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, సెప్టంబర్ 7)**
యర్రగొండపాలెం: వినాయక చవితి సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసే గణపతి మండపాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని యర్రగొండపాలెం ఎస్సై ఎం. దేవకుమార్ సూచించారు. వినాయక ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసే మండపాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల ఏర్పాటు వల్ల రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని, ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా రహదారులను ఆక్రమించరాదని సూచించారు.అగ్నిప్రమాదాల నివారణకు తగిన భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. లౌడ్‌స్పీకర్లను అనుమతించిన సమయాల్లోనే వినియోగించాలని,అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ తెలిపారు. వినాయక నిమజ్జనం,శోభాయాత్రలు లేదా ర్యాలీలు నిర్వహించాలనుకుంటే ముందుగానే పోలీసులకు సమాచారం ఇచ్చి అనుమతులు పొందాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి మండప నిర్వాహక సంఘం పోలీసులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీ, విద్యుత్, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేసుకుని ఉత్సవాలు నిర్వహిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని తెలిపారు. ప్రభుత్వం, పోలీసులు నిర్దేశించిన నిబంధనలు పాటించే మండపాలకు పూర్తి పోలీసు భద్రత కల్పిస్తామని ఎస్ఐ ఎం దేవకుమార్ వెల్లడించారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

## రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టెంబర్ 7)

మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను వేధిస్తూ, అంతకుముందు భార్యను హత్య చేసిన కేసులో శిక్ష అనుభవించి వచ్చిన ఒక వ్యక్తి, ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైదుకూరు మండలంలో చోటుచేసుకుంది. బాధితుల, పోలీసుల కథనం ప్రకారం గడ్డమాయపల్లె గ్రామానికి చెందిన చెరుకూరు హాజరత్ (58) అనే వ్యక్తి మద్యానికి బానిసై 2010లో తన భార్య హాజరతమ్మను హత్య చేశాడు. ఈ కేసులో జైలు శిక్ష అనుభవించి 2019లో బయటకు వచ్చినప్పటికీ, అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. మైదుకూరు మండలం వనిపెంట గ్రామంలో ఉంటున్న తన కుమార్తె హసీనా, కుమారుడు పెద్ద వీరయ్యల వద్దకు ప్రతి ఆదివారం వచ్చి "మీ అమ్మను చంపినట్లే మిమ్మల్ని కూడా చంపుతాను" అని బెదిరింపులకు దిగేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కూడా కుమార్తె హసీనా వద్దకు వచ్చి గొడవపడి బెదిరించి వెళ్లాడు. సాయంత్రం కుమారుడు పెద్ద వీరయ్య తండ్రికి నచ్చజెప్పేందుకు గడ్డమాయపల్లెలోని ఇంటికి వెళ్లగా, హజరత్ ఇంట్లో పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు తలుపులు పగలగొట్టి అతడిని బయటకు తీసి 108 అంబులెన్స్‌లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం హజరత్ మృతి చెందాడు. కుమార్తె హసీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు నాగేల్ల పాల్‌కు ఘన సన్మానం



(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 7)

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న నాగేల్ల పాల్‌ను ఘనంగా సన్మానించారు. మార్కాపురం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి కాటమాల చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ హెడ్‌మాస్టర్ ఏసేబు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు తిట్ల చిట్టి, ఆరే ఆనంద్, ప్రదీప్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొని నాగేల్ల పాల్‌ను అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని, ఉపాధ్యాయుడిగా అందిస్తున్న సేవలను వారు ప్రశంసించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, నాగేల్ల పాల్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

# 'మీకోసం' వినతుల పరిష్కారానికి అత్యున్నత ప్రాధాన్యం

**అధికారులకు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశం**

**సకాలంలో అర్జీల నాణ్యమైన పరిష్కారం**

**అర్జీదారునిలో సంతృప్తి స్థాయిని పెంచేలా చర్యలు**

**పిజిఆర్ఎస్‌కు 246 అర్జీలు**





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 7)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' ద్వారా ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీకి అత్యున్నత ప్రాధాన్యమిచ్చి, వేగవంతంగా మరియు నాణ్యమైన పరిష్కారం చూపాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. సోమవారం ఒంగోలులోని ప్రకాశం భవనంలో నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్‌ఓ పి వెంకటరమణ, ఎస్‌డిసి మాధురి, ఈడీ బీసీ కార్పొరేషన్ వెంకటేశ్వరరావులతో కలిసి ఆయన ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 246 అర్జీలు నమోదయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న వినతుల పట్ల అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ ద్వారా నమోదైనవి, నేరుగా కలెక్టరేట్‌లో అందజేసినవి, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చినవి, మండల స్థాయి వినతులు 'పల్లె నిద్ర' వంటి ప్రత్యేక కార్యక్రమాలలో వచ్చిన ప్రతి ఒక్క అర్జీ పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి అర్జీదారునికి జిల్లా కార్యాలయం నుండే స్వయంగా ఫోన్ చేసి, అర్జీ నమోదైన వివరాలను తెలియజేస్తూ, సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని స్పష్టమైన భరోసా కల్పించే ప్రక్రియను జిల్లా అధికారులు తక్షణమే ప్రారంభించాలన్నారు. కేవలం కింది స్థాయి సిబ్బంది ఇచ్చే నివేదికల పైనే ఆధారపడకుండా, జిల్లా స్థాయి అధికారులు స్వయంగా గ్రామాల్లో పర్యటించాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యల తీవ్రతను స్వయంగా పరిశీలించి, వాటిని త్వరితగతిన గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అర్జీలను కేవలం సాంకేతికంగా ముగించడం కాకుండా, ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితిలోగా నాణ్యమైన, సహేతుకమైన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల తమ స్థాయిలో పరిష్కరించలేని పరిస్థితి ఉంటే, దానికి గల స్పష్టమైన కారణాలను అర్జీదారులకు వివరించి అవగాహన కల్పించాలన్నారు. అంతేకాకుండా అర్జీదారులలో సంతృప్తి స్థాయిని పెంచాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ సర్వేలో ప్రజల నుంచి అత్యుత్తమ సానుకూల అభిప్రాయం లభించేలా అధికారులు చురుగ్గా పనిచేయాలని, రీ ఓపెన్ అయ్యే అర్జీలను ప్రత్యేకంగా సమీక్షించి సమస్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని తెలిపారు. శాఖాపరంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల అమలును నిరంతరం పరిశీలిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వెలిగొండ ప్రాజెక్టు పూర్తిలో కృషి చేసిన అధికారులకు ఘన సత్కారం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 7)

ప్రతిష్టాత్మకమైన వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చే జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామా నాయుడు నిరంతర కృషితో ఘనంగా ప్రారంభించి పశ్చిమ ప్రకాశం వాసుల చిరకాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి శ్రమించిన చీఫ్ ఇంజనీర్ ప్రాజెక్ట్స్ ఒంగోలు కే రమేష్, సూపరింటెండింగ్ ఇంజనీరు, వెలిగొండ ప్రాజెక్ట్ షేక్ అబుతాలిమ్‌లను సోమవారం ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌సిహెచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ ప్రాజెక్ట్స్ ఒంగోలు కే రమేష్ మాట్లాడుచూ నేడు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడానికి జలవనరుల శాఖలో ఇంజనీర్ల నుండి క్రింది స్థాయి ఉద్యోగుల వరకు కష్టపడి పనిచేయడం వలన మాత్రమే ఇది సాధ్యం అయ్యింది అని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు నిరంతర పర్యవేక్షణ, సూపరింటెండింగ్ ఇంజనీరు షేక్ అబూతాలిమ్ కూడా చక్కగా క్రింది స్థాయి ఉద్యోగులను కలసి పనిచేయడం వలన మనం ప్రాజెక్ట్ ను పూర్తి చేసుకొన్నామన్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డిపార్ట్మెంట్ యన్‌జిఓ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌సిహెచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి తలమానికం అయిన వెలిగొండ ప్రాజెక్ట్ ను పూర్తి చేయడం ఈ ప్రాజెక్టులో పనిచేసే ఉద్యోగులుగా తమకు గర్వకారణంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసిన ప్రభుత్వానికి, ప్రాజెక్టు పూర్తి కావడానికి కృషి చేసిన ఇంజనీర్లు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జిజె ప్రసాద్, ప్రకాశం జిల్లా అధ్యక్షులు తోటా శ్రీనివాసరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బి కృష్ణకిషోర్, వెలిగొండ ప్రాజెక్ట్ యూనిట్ అధ్యక్షులు షేక్ మగ్దుం షరీఫ్, పిజిపి యూనిట్ కార్యదర్శి యు నిరంజన్ కుమార్, రిగేషన్ సర్కిల్ యూనిట్ అధ్యక్షులు పి వీరయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే జలాని, కన్స్ట్రక్షన్ సర్కిల్ నాన్ టెక్నికల్ పర్సనల్ అసిస్టెంట్ సిహెచ్ మధుబాబు, ఇరిగేషన్ మహిళా విభాగం చైర్మన్ సిహెచ్ శిరీష, వి జ్యోతి, కార్యవర్గ సభ్యులు ప్రసాద్, జనార్దన్‌రెడ్డి, కె జాన్, సత్య సుకుమార్, సుధీర్, బి బోస్, టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాసులు, మహిళా కార్యవర్గ సభ్యులు వి తులసి, డి దేవమ్మ, షేక్ జమీల బేగం, శైలజ కుమారి, పి ఆదిలక్ష్మి, వై కిరణ్మయి, సిహెచ్ మస్తాన్‌బి, జలవనరుల శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 7)



ఒంగోలులో శ్రీకృష్ణుని జన్మదిన వేడుకల్లో భాగంగా కుట్టుబోయినపాలెంలో శ్రీకృష్ణ యాదవ ఫ్రెండ్స్ క్లబ్ కుట్టు బోయిన కోటి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్, ఎగ్జామ్ ప్యాడ్స్‌తో పాటు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో బీసీల పట్ల అటు ఎన్డీఏ కూటమి, ఇటు వైఎస్సార్‌సీపీ వ్యవహరిస్తున్న తీరుపై రామచంద్ర యాదవ్ మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీవై పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమాజవాది పార్టీ పాశం వెంకటేశ్వర్లు, అంగి రేకుల ఆదిశేషు, బీసీవై పార్టీ జిల్లా అధ్యక్షులు చల్ల హరి, మట్టే రాఘవ,తుమ్మకూరి హనుమంతరావు కుట్టు బోయిన సురేష్,ఠాగూర్ శీను, జట్టు తిరుపతయ్య, అరవ శీను, తుమ్మకూరు సాయి, కుట్టుబోయిన వెంకటసుబ్బయ్య, మిరియం శ్రీనివాసులు, బీసీవై పార్టీ నాయకులు, యాదవ కమ్యూనిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## నేడే సర్వసభ్య సమావేశం

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టంబర్ 7)

చిన్నగంజాం మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె ధనలక్ష్మి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన సమావేశం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరై తమ శాఖలకు సంబంధించిన అంశాలను చర్చించాలని కోరారు.

## రెవెన్యూ ఉద్యోగికి ఘణ నివాళులు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టంబర్ 7)

చిన్నగంజాం మండలం రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా వీధులు నిర్వహిస్తోన్న పీఎస్ కళ్యాణ్ రెండు రోజుల క్రితం మృతి చెందటంతో సోమవారం మండల తహశీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంపిడిఓ కె.ధనలక్ష్మి కళ్యాణ్ మృతికి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూల మాల వేసి ఘణంగా నివాళులర్పించి సేవలను కోనియాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె ప్రభాకరరావు, ఎపిడిఓ కె ధనలక్ష్మి, డిటి సుజత, అర్ఐ మునిర్, విఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది, సర్వే సిబ్బంది ఉన్నారు.

## పార్టీ బలోపేతానికి మండల కమిటీ నియామకం



(షణ్ముఖ వెలుగు, జగ్గంపేట, సెప్టంబర్ 7)

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశానుసారం మండల అధ్యక్షుడు పల్లా రాము ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ బలోపేతానికి మండల కమిటీ నియమించడం జరిగిందని కాకినాడ జిల్లా అధ్యక్షుడు రంబాల వెంకటేష్ బాబ్జి తెలిపారు. సోమవారం వారు స్థానిక నాయకులతో మాట్లాడుతూ ఈ నెల 17న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా ప్రతి నాయకుడు, కార్యకర్త వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. మండల కార్యదర్శి పోతంశెట్టి రమ్య మాట్లాడుతూ రానున్న పంచాయితీ ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు పార్టీకి పనిచేయాలని ఏకతాటి పై నడవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పదిలం సోమశేఖర్, సప్పటి రంగా, పాలిక దేవి, గొల్తి సతీష్‌స్వామి, కోరుమిల్లి నాగేశ్వరావు, సిహెచ్ సంతోష్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ పల్లె వీక్షణ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 7)

జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం పిజిఆర్ఎస్ పల్లె వీక్షణ సోమవారం ఉలవపాడు గ్రామపంచాయతీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక మండల ప్రజా పరిషత్ ఉలవపాడు ప్రాంగణం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, మండల ప్రత్యేక అధికారి బి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ ఏవి రవిశంకర్, ఎంపీడీవో బి సురేష్, డిప్యూటీ ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాసులు, స్వర్ణ గ్రామం డిప్యూటీ ఎంపీడీవో ఎం జగదీష్, మండల స్థాయి అధికారులు, స్వర్ణ గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 20 వినతులను స్వీకరించారు. వీటిని పిజిఆర్ఎస్ నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించుటకు చర్యలు చేపట్టాలని సీఈఓ అధికారులను ఆదేశించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

## ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో పరిష్కరించాలి

### జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టెంబర్ 7)
వైఎస్ఆర్ కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుంటూ వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 153 ఫిర్యాదులు దాఖలయ్యాయి. ప్రతి ఫిర్యాదును స్వయంగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి కేసుల వివరాలను ఆరా తీశారు. ఫిర్యాదులపై చట్టపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా నిష్పక్షపాతంగా విచారణ పూర్తి చేసి బాధితులకు తగిన న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నిరభ్యంతరంగా పోలీస్ శాఖ దృష్టికి తీసుకురావచ్చని, చట్ట పరిధిలో పరిష్కరించగల ప్రతి అంశంపై వేగంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో స్వీకరించాలి. నిర్ణీత గడువులోగా చట్ట ప్రకారం విచారణ పూర్తి చేయాలి. బాధితుల సమస్యలను సానుభూతితో విని న్యాయం చేయాలి. ఎలాంటి ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్ సుధాకర్, కడప డిఎస్పీ బాలస్వామిరెడ్డితో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సీపీ కడప జిల్లా విస్తృత స్థాయి సమావేశం విజయవంతం

### రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీ క్లీన్ స్వీప్ లక్ష్యం

### వైఎస్ఆర్ కడప జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం






(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టెంబర్ 7)
వైఎస్ఆర్ కడప జిల్లా కడప కన్వెన్షన్ హాల్‌లో సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం అత్యంత వైభవంగా, అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడింది. వైఎస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశానికి జిల్లాలోని ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల సమన్వయకర్తలు మరియు భారీ సంఖ్యలో శ్రేణులు, కార్యకర్తలు హాజరయ్యారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్ కడప జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేయడమే ఏకైక లక్ష్యంగా, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసేందుకు ఈ సమావేశం నిర్వహించబడింది.

**వినాయకుల దిశానిర్దేశం–పిలుపు**

సమావేశంలో ప్రసంగించిన ముఖ్య నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి ఆశయాలను, ప్రజా సంక్షేమ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేసి వైఎస్ఆర్ కడప జిల్లా వైఎస్ఆర్సీపీకి కొండంత అండ అని మరోసారి నిరూపించాలని పిలుపునిచ్చారు. ప్రతీ నియోజకవర్గంలోనూ, మండల స్థాయిలోనూ అనుబంధ సంఘాలను బలోపేతం చేస్తూ, ప్రజలతో మమేకం కావాలని స్పష్టం చేశారు. ఈ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీకి చెందిన పలువురు అగ్రనేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. అజయ్ రెడ్డి, వైయస్ అవినాష్‌రెడ్డి, కే సురేష్ బాబు, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, సెట్టిపల్లి రఘురామిరెడ్డి, ఎస్ బి అంజద్ బాషా, సుధమ్మ, నరేన్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, గోవిందరెడ్డి, వీరితో పాటు జిల్లా స్థాయి నాయకులు, నాయకురాళ్ళు, నగర అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, వేలాది సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని దిగ్విజయం చేశారు. జగనన్న నాయకత్వంలో పార్టీ అభ్యర్థుల భారీ మెజారిటీయే లక్ష్యంగా అందరం ఐక్యంగా ముందుకెళ్తామని ఈ సందర్భంగా శ్రేణులు ఏకగ్రీవంగా తీర్మానించాయి.

# నెల్లూరులో అట్టహాసంగా ఆర్యవైశ్య అర్బన్ కమిటీ ముందస్తు ప్రమాణ స్వీకారం

**త్వరలో మహాసభ గౌరవ చైర్మన్ టిజి వెంకటేష్, అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్య సమక్షంలో ప్రమాణ స్వీకార మహోత్సవం**

**ఆర్యవైశ్య సంఘం ఎఅధ్యక్షుడిగా మునగ నాగేశ్వరరావు, సెక్రటరీగా కోటా రమేష్ బాబు, ట్రెజరర్‌గా జొన్నలగడ్డ వెంకట చలపతిరావు**













(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 7)
శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ముందస్తు ప్రమాణ స్వీకార మహోత్సవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సన్నిధిలో అత్యంత వైభవంగా జరిగింది. పలువురు కమిటీ సభ్యులు ముందుగా వాసవి మాత అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకొని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అనుసంధానం నెల్లూరు ఆర్యవైశ్య సంఘం అర్బన్ జిల్లా అధ్యక్షులుగా మునగ నాగేశ్వరరావు, సెక్రటరీగా కోటా రమేష్ బాబు, ట్రెజరర్‌గా జొన్నలగడ్డ వెంకట చలపతిరావు, నెల్లూరు ఆర్యవైశ్య అర్బన్ మహిళా మండలి అధ్యక్షురాలు శేషాద్రి సువర్ణ కుమారి, సెక్రటరీ మెంటా రేవతి, టెజరరు కొత్తూరు లక్ష్మి సుకన్య, యువజన సంగం అధ్యక్షులు వి యల్ హరి శంకర్, సెక్రటరీ పెసల సాయి మోహిత్, టెజరరు మెంటా సాయి రమణ, మరియు కార్యవర్గం 102 మందితో ఇతర కమిటీ సభ్యులు అమ్మవారి సమక్షంలో ప్రమాణ స్వీకారం నెల్లూరు ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు కొండా ప్రవీణ్ శంకర్, సేగు షణ్ముఖరావు, పేర్ల సీతారామారావు, తిరువీధి ప్రకాష్ రావు, వారి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం మహోత్సవం అమ్మవారి సన్నిధిలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన మునగ నాగేశ్వరరావు, పలువురు మాట్లాడుతూ త్వరలో మాజీ రాజ్యసభ సభ్యులు, మహాసభ గౌరవ చైర్మన్ టి.జి. వెంకటేష్, మహాసభ అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్య, ఇతర పెద్దల సమక్షంలో నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం కన్నులపండువగా జరగనుందని వెల్లడించారు. ప్రస్తుతం శ్రావణమాసం సందర్భంగా సోమవారం వాసవి మాత సన్నిధిలో తాత్కాలికంగా ప్రమాణ స్వీకారం నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు

**మునగ నాగేశ్వరరావు సేవలు ప్రశంసనీయం :**

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కోనకర్ల శోభన్ బాబు, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు తాతా కిషోర్ తో పాటు పలువురు నెల్లూరు అర్బన్ జిల్లా మాజీ ప్రెసిడెంట్లు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ఏపీల కుంట్ల నుండి నెల్లూరుకు వచ్చి స్థిరపడిన మునగ వెంకటసుబ్బయ్య, కాంతమ్మల కుమారుడైన మునగ నాగేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. గత 42 సంవత్సరాలుగా ఉమ్మడి కుటుంబంలో ఎలాంటి విభేదాలు లేకుండా అన్యోన్యంగా ఉంటూ నేటి సమాజానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. అలాగే గత 20 ఏళ్లకు పైగా రైస్ మిల్ అసోసియేషన్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తూ, పార్టీలకతీతంగా మిల్లర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. నెల్లూరులోని వాసవి మాత దేవాలయంతో పాటు అనేక ఆలయాలకు విరాళాలు అందిస్తూ వారి కుటుంబం అందించిన ఆధ్యాత్మిక సేవలు మరువలేనివని కొనియాడారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉండే నాగేశ్వరరావు సేవలను గుర్తించి ఈ పదవికి ఎంపిక చేయడం అభినందనీయమని అన్నారు. రాబోవు రోజుల్లో మునగా నాగేశ్వరరావు రాష్ట్ర స్థాయిలో మరెన్నో పదవులు అలంకరించి వారి సేవలు నెల్లూరు ప్రజలకు ఎప్పటికీ ఇలాగే కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.

**అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా :**

మునగ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యతను వివరిస్తూ, నేటి తరం కూడా ఆదర్శవంతమైన కుటుంబ విలువలను కాపాడుకోవాలని సూచించారు. అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతతో సేవ చేసే పరిధి మరింత పెరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నెల్లూరు జిల్లా స్థాయి నుండి మహాసభ బిల్డింగ్ ఫండ్ సేకరించడంతో పాటు సభ్యత్వాల పెంపునకు నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు గుండ్లపల్లి పద్మప్రియ చీకిరాళ్ల పద్మావతి, నెల్లూరు నగరానికి చెందిన పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, సంఘ నాయకులు మరియు నూతన కమిటీ సభ్యులు విశేషంగా పాల్గొన్నారు.

# ప్రభుత్వ హామీల అమలు పై సంతృప్తి వ్యక్తం చేసిన అస్యూరెన్స్ కమిటీ

**ఒంటిమిట్ట ఆలయం, రిమ్స్, గాంధీనగర్ పాఠశాల, సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని పరిశీలించిన కమిటీ**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 7)
ప్రభుత్వ హామీల అమలు, ప్రజలకు అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఏపీ శాసనసభ ప్రభుత్వ హామీల కమిటీ సభ్యులు, ప్రభుత్వ హామీల అమలు తీరు, ప్రజలకు అందుతున్న సేవలపై కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం వైఎస్సార్ కడప జిల్లాలో ఎపి లెజిస్లేటివ్ కమిటీ (ఆన్ గవర్నమెంట్ అస్యూరెన్స్) చైర్మన్, ఎమ్మెల్సీ ఇసాక్ భాషా, ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీ పి.వి. సుబ్బారెడ్డిలు ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం, కడప రిమ్స్, గాంధీనగర్ ఉన్నత పాఠశాల, సీపీ బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం, గ్రంథాలయాలను పరిశీలించారు. ముందుగా ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయానికి చేరుకున్న కమిటీ ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించింది. ఒంటిమిట్ట చెరువులో హనుమంతుని విగ్రహం ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించింది. అనంతరం శ్రీ కోదండరామస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కడప రిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన కమిటీ వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించింది. రేడియాలజీ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, కేంద్ర ప్రయోగశాల తదితర విభాగాలతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని కేథ్ ల్యాబ్, ప్రీ కేథ్ ల్యాబ్, కన్సోల్ వార్డు, శస్త్రచికిత్స గదుల సముదాయం, సూక్ష్మజీవ శాస్త్ర విభాగం, పరిపాలనా భవనాన్ని పరిశీలించారు. అనంతరం మానసిక వైద్యశాలలోని వైద్య, మానసిక వైద్య, మానసిక శాస్త్ర ప్రయోగశాల, పరిశోధనా ప్రయోగశాల, ఆర్‌టీఎంఎస్ గది, ఎక్స్‌రే, ఈసీజీ హాలు, పురుషుల




వార్డులను పరిశీలించారు. క్యాన్సర్ ఆసుపత్రిలోని వివిధ విభాగాలను కూడా సందర్శించి అక్కడి వసతులు, వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిజిహెచ్ ఆసుపత్రిలో అందుతున్న ఓపి వైద్య సేవలు, పరికరాలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న కమిటీ, ఆసుపత్రుల్లోని ఏర్పాట్లు, సేవల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపింది. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ సునీల్, మానసిక వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రాముడు, క్యాన్సర్ ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ తిరుపాలయ్య, తదితరులు కమిటీకి వివరాలు అందించారు.

**విద్యార్థుల ప్రతిభకు అభినందనలు..**

కడప గాంధీనగర్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కమిటీ పాఠశాలలోని మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించింది. విద్యార్థుల మానసిక వికాసం, క్రీడా నైపుణ్యాలు, వివిధ రంగాల్లో సాధించిన విజయాల గురించి తెలుసుకుని వారిని అభినందించింది. విద్యతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పేర్కొంది. జిల్లా విద్యాశాఖ అధికారి శంశుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**అమూల్యమైన తాళపత్ర గ్రంథాల పరిశీలన..**

అనంతరం కడపలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం, గ్రంథాలయాన్ని కమిటీ సందర్శించింది. యోగి వేమన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న సీపీ బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రంలో జానమద్ది సాహితీపీఠం సౌజన్యంతో ఏర్పాటు చేసిన తెలుగు భాషా సముపార్జకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ విగ్రహాన్ని కమిటీ సభ్యులు పరిశీలించారు. పరిశోధనా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. గ్రంథాలయంలో నిక్షిప్తమైన అమూల్యమైన పురాతన తాళపత్ర గ్రంథాలు, పరిశోధనా గ్రంథాలు, అరుదైన పుస్తకాలను పరిశీలించి వాటి సంరక్షణ, పరిశోధనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. తెలుగు భాష, సాహిత్య పరిరక్షణకు సీపీ బ్రౌన్ చేసిన సేవలను ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ప్రశంసించారు. కార్యక్రమంలో యువజన విశ్వవిద్యాలయం వీసీ బెల్లంకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ పద్మ, డైరెక్టర్ గంజి పార్వతి, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.






